## జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్‌గా అంతరెడ్డి రాజారెడ్డి

**నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ**

నిజామాబాద్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్‌గా అంతరెడ్డి రాజారెడ్డి నియమితులయ్యారు. జిల్లాకు చెందిన అంతరెడ్డి రాజారెడ్డిని డిసిఎల్ చైర్మెన్‌గా నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వెంకటేశం ఉత్తర్వులు బుధవారం జారీచేశారు. ఈ మేరకు మాజీ మంత్రి, బోధన్ శాసనసభ్యులు పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి గురువారం నియామకపత్రాన్ని రాజారెడ్డికి అందజేశారు. సుదీర్ఘ కాలంగా కాంగ్రెస్‌లో ఉండి, మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డికి ముఖ్య అనుచరుడిగా ఉన్నందుకే జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్‌గా నియమించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్‌గా తనను నియమించినందుకు సీఎం రేవంత్‌రెడ్డితో పాటు బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డికి, జిల్లా కాంగ్రెస్ నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.


నియామకపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే


# నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

1

## నిజామాబాద్-కామారెడ్డి

శుక్రవారం | అక్టోబర్ 11, 2024 | www.navatelangana.com


## ఎస్సీ కాలనీలో పారిశుధ్య లోపం

**నవతెలంగాణ-రెంజల్**

మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో పారిశుధ్య లోపంతో ప్రజలు, చిన్నపిల్లలు రోగాల బారిన పడుతున్నారని ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీగారి భూమయ్య ఆరోపించారు. పలుమార్లు సమస్యను గ్రామ కార్యదర్శి దృష్టికి తీసుకువెళ్లినా.. వారు పట్టించుకోవడంలేదని ఆయన అన్నారు. మినీ ట్యాంకుల శుభ్రం చేయడంలో గ్రామపంచాయతీ సిబ్బంది నిర్లక్ష్యం చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. రాబోయే పండుగలను దృష్టిలో పెట్టుకొని ఎస్సీ కాలనీలోని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు, తాగునీటి ట్యాంకులను శుభ్రం చేసి స్వచ్ఛమైన నీటిని ప్రజలకు అందించాలని ఆయన కోరారు. ఈ విషయంలో ఎంపీడీవో, జిల్లా పంచాయతీ అధికారులకు వినతిపత్రాలు సమర్పించినట్లు ఆయన పేర్కొన్నారు.



# కూరగాయల భారం

- భగ్గుమంటున్న కూరగాయల ధరలు
- కొనాలంటే భయపడుతున్న సామాన్యులు
- కిలో రూ.400 పలుకుతున్న ఎల్లిపాయలు

**నవతెలంగాణ-కామారెడ్డి**

కూరగాయల ధరలు రోజురోజుకూ భగ్గుమంటున్నాయి. దీంతో సామాన్యులు కూరగాయలు కొనాలంటేనే భయపడుతున్నారు. ఇందుకు కారణం కూరగాయల సాగుతగ్గడమే. గతంలో చాలా మంది రైతులు తమ వ్యవసాయ భూముల్లోనే కూరగాయలతో పాటు ఎల్లిపాయలు, ఉల్లి పంటను సాగుచేసేవారు. సాగు తగ్గడంతో ఆ రైతులే మార్కెట్‌లో కూరగాయలు కొనుక్కొని తినాల్సి వస్తోంది.


కామారెడ్డి మార్కెట్‌లో కూరగాయల విక్రయాలు

**రూ.100 పలుకుతున్న బీరకాయలు..**

గతంలో రైతులే కాదు గ్రామాలలోని ఇండ్లలో సైతం తీగ కూరగాయలైన బీర, సొరకాయ, చిక్కుడుకాయ, కాకరకాయ చెట్లను తమ ఇంటి పెరటిలో పెంచుకునేవారు. నేడు ఏ గ్రామానికి వెళ్లిన ఇవి ఎక్కడా కనిపించడం లేదు. దీంతో కిలో బీరకాయలు రూ.100, చిక్కుడుకాయ రూ.70, సొరకాయ సైజును బట్టి రూ.30, కాకరకాయ రూ.70 ధర పలుకుతోంది.

**టమాట రోజుకో ధర..**

టమాట ధర నిలకడగా ఉండడం లేదు. ఒకరోజు రూ.80 ధర పలికితే, మరో రోజు రూ.70 ధర పలుకుతోంది టమాట. నిల్వ ఉన్న టమాట రూ.60 కిలో విక్రయిస్తున్నారు. స్థానికంగా ఈ పంటలు పండక పోవడంతో రవాణాచార్జి పేరుతో దళారులు అధికంగా లాభపడుతున్నారు. టమాటా ఎక్కువగా ఆంధ్ర నుంచి రవాణా అవుతుందని వ్యాపారులు చెబుతున్నారు.

**50కి తగ్గని ఉల్లిగడ్డ..**

ఇంటి పంటగా చెప్పుకునే ఉల్లిగడ్డ నేడు మార్కెట్లో కిలో రూ.50కి తగ్గడం లేదు. నేడు ఏ వంట చేసుకున్న ఉల్లిగడ్డ లేనిది వంట చేయడం లేదనేది జగమెరిగిన సత్యం. ప్రతి ఒక్క ఇంట్లో వంటలో ఉల్లిగడ్డ ఉండవలసిందే. దీంతో ఉల్లిగడ్డ ధర పైకి ఎగబాకడంతో దానిని కొనాలంటేనే జంకుతున్నారు సామాన్యులు.

**ఎల్లిపాయలు రూ.కిలో 400..**

ఎల్లిపాయలను గతంలో వ్యవసాయం చేస్తున్న వ్యక్తి ఇంట్లో నిలువ ఉండేవి. రాను రాను రైతులు ఎల్లిపాయల పంట పండించడానికి దూరం కావడంతో నేడు ఆ ఎల్లిపాయల ధర కిలో రూ.400కు చేరింది. దీనిని రైతులే కాదు సామాన్యుడు సైతం కొనుగోలు చేసే స్థితిలో లేరు.

### రూ.500 తీసుకెళ్లినా సంచి నిండడం లేదు

గత రెండు మూడు సంవత్సరాల క్రితం రూ.500 తీసుకెళ్తే వారానికి సరిపడా కూరగాయలు వచ్చేవి. ప్రస్తుతం రూ.500 తీసుకొని మార్కెట్‌కు వస్తే చేతి సంచి నిండడం లేదు. సుమారు మా ఇంటికి సరిపడా కూరగాయలు తీసుకోవాలంటే ఎనిమిది వందల నుండి 1000 రూపాయలు కావాల్సిందే.

**- నరసవ్వ, రామేశ్వర్‌పల్లి**

### కొనాలంటేనే భయమేస్తోంది

ఇద్దరు పిల్లలం, మేం అందరం కలిసి నలుగురం. ప్రతి గురువారం కామారెడ్డి పట్టణంలో అంగడి సాగుతుంది. గతంలో అతికొద్ది ఖర్చుతో వారానికి సరిపడా కూరగాయలు తీసుకువెళ్లేటోళ్లం. నేడు రూ.500 తీసుకొని వచ్చిన వారానికి సరిపడా కూరగాయలు రావడం లేదు. ఇంతకుముందు కూరగాయలు మా కాలనీలోకి సైకిళ్లపై, ద్విచక్ర వాహనాలపై వచ్చి విక్రయించేవారు. నేడు ఎవరూ కూడా కూరగాయలు తీసుకొని కాలనీలోకి వచ్చి విక్రయించడం లేదు.

**- కామారెడ్డి పట్టణం బీడీ కాలనీవాసులు ప్రమీల**

### రైతులు విక్రయిస్తేనే లాభం

నేను ఉద్యోగం చేసే సమయంలో రైతులు కూరగాయలు పండించి విక్రయించేవారు. రెండు మూడు రోజులకు ఒకసారి మా కాలనీలోకి వచ్చి విక్రయించేవారు. మార్కెట్లో 30 రూపాయల కిలో టమాట ఉంటే, గల్లీలోకి వచ్చి ఐదు రూపాయల తక్కువ చేసి 25 రూపాయల కిలో అమ్మేవారు. దీంతో అటు రైతుకు ఇటు కొనుగోలుదారులమైన మాకు లాభం జరిగేది. ఇదే రైతు ఇదే టమాటాను దళారులకు ఇస్తే దళారులు రూ.15 ఎక్కువ రైతులకు చెల్లించేవారు కాదు. కొనుగోలుదారులమైన మాకు రూ.30 కిలో అమ్మేవారు. దీంతో ఎలాంటి కష్టపడకుండానే రైతు ఎంత సంపాదిస్తున్నాడో దళారి అంతే సంపాదిస్తున్నాడు. రైతులు తిరిగి కూరగాయలు పండించి విక్రయిస్తే రైతులకు అధిక ఆదాయంతో పాటు కొనుగోలుదారులకు సైతం తక్కువ ధరకు కూరగాయలు దొరికే పరిస్థితి నెలకొంటుంది. **- రాజేశం, కామారెడ్డి, రిటైర్డ్ ఉద్యోగి**

### ఇతర రాష్ట్రాల నుంచి కూరగాయలు..

మహారాష్ట్ర నుంచి పచ్చిమిర్చి, అల్లం, ఎల్లిపాయ, ఉల్లిగడ్డలు తెలంగాణకు వస్తుంటాయని వ్యాపారులు చెబుతున్నారు. అలాగే ఆంధ్రప్రదేశ్ నుంచి బీట్‌రూట్, గోబీ, టమాటా, వంకాయ, మిర్చి, చిక్కుడుకాయ, క్యారెట్, కీరదోస తదితర కూరగాయలు తెలంగాణకు వస్తున్నాయి. దీంతో దళారులు రవాణా చార్జీల పేరుతో అందిన కాడికి దండుకుంటూ కూరగాయల రేట్లు పెంచేస్తున్నారు.

## మార్కెట్ కమిటీలను అభివృద్ధి చేయాలి

- కాంగ్రెస్ పార్టీలో అందరం ఒకే కుటుంబం
- పాత కార్యకర్తలకే ప్రాధాన్యమిస్తున్నా..
- వ్యవసాయ శాఖ సలహాదారులు పోచారం శ్రీనివాస్‌రెడ్డి

**నవతెలంగాణ-వర్ని**

'రాష్ట్రంలో అత్యధిక వరి పంటను పండించే ప్రాంతం బాన్సువాడ నియోజకవర్గం. ఇక్కడ రైతులకు ధాన్యం నిల్వ, ధాన్యం కొనుగోలు కేంద్రాలు సకాలంలో ఏర్పాటు చేస్తాం' అని రాష్ట్ర వ్యవసాయ శాఖ సలహాదారులు పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం వర్ని మండల కేంద్రంలో వర్ని, చందూర్, రుద్రూర్, మోస్రా మండలాల మార్కెట్ కమిటీ చైర్మన్‌గా సురేష్ బాబా, వైస్ చైర్మన్‌గా కొత్మీకర్ లక్ష్మణ్, 12 మంది డైరెక్టర్ల ప్రమాణ స్వీకరణ సభలో ఆయన పాల్గొన్నారు. నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేశారు. ముందుగా ఎస్ఎన్‌పురం, శ్రీనగర్, నెహ్రూనగర్, పాత వర్ని పరిధిలో పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీ సురేష్ కుమార్ శెట్కార్, రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజు కొనుగోలు కేంద్రాన్ని పారంభించారు. ఈ సభలో ఎంపీ సురేష్ కుమార్ శెట్కార్ మాట్లాడుతూ.. రైతుల ధాన్యం ఏ గ్రేడ్ రూ.2330, బీ గ్రేడ్ రూ.2300 ప్రభుత్వం ఇస్తుందని అన్నారు. త్వరలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రూ.500 బోనస్ కూడా ఇస్తామని తెలిపారు. ఆగ్రో చైర్మన్ కాసుల బాలరాజు మాట్లాడుతూ.. పేదల కోసం ప్రభుత్వం సంక్షేమ పథకాలు పూర్తి చేసిందని అన్నారు. రైతులకు రుణమాఫీ అన్ని వర్గాల వారికి ఇచ్చిందని తెలిపారు. అనంతరం పోచారం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. ఉమ్మడి వర్ని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నామినెటెడ్ పదవికి అర్హులు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సురేష్ బాబాను నియామకం కొరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరావుతో చర్చలు జరిపి పదవి బాధ్యతలు అప్పగించినట్టు తెలిపారు. నూతన పాలకవర్గం మార్కెట్ కమిటీ అభివృద్ధి కోసం కృషి చేయాలని అన్నారు. తాను కాంగ్రెస్ పార్టీలోకి వచ్చిన తరువాత ఎక్కడా, ఏ సందర్భంలోనూ పక్షపాతం చూపలేదని తెలిపారు. కాంగ్రెస్ పార్టీలోని పాత నాయకులకు మాత్రమే ప్రాధాన్యం ఇచ్చానన్నారు. నామినెటెడ్ పదవుల్లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులకే పదవులు ఇస్తున్నానని, కానీ కొందరు నేను పార్టీలోని రావటంతో లేనిపోని అబద్దాలు చెప్పి తనపై అనుచరులను తప్పుతోవ పట్టిస్తున్నారని అన్నారు. తాను పార్టీలోకి ఒక్కడినే రాలేదని, నా కార్యకర్తల బలగంతో వచ్చానని వివరించారు. నాతో పోటీ చేసి ఓడిపోయిన రవీందర్‌రెడ్డికి కూడా ముఖ్యమంత్రి, పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ 'బాన్సువాడ పోవద్దు.. మరో నియోజకవర్గంలో ఛాన్స్ ఇస్తాం' అని తెలిపినా ఇప్పటికీ వారు కొందరు అమాయకులను నాపై ఉసిగొల్పుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పక్షాన అండగా ఉంటుందని, ఇప్పటివరకు 22 లక్షల మంది రైతులకు 18 వేల కోట్ల రూపాయలు రుణమాఫీ చేసిందన్నారు. మిగిలిన వారికి కూడా త్వరలో ప్రభుత్వం రుణమాఫీ చేస్తుందన్నారు. మార్కెట్ కమిటీలోని ఒక్క పైసా కూడా దుర్వినియోగం చేయకుండా చూడాలని, తేడా రావొద్దని అన్నారు. రైతుల కోసం 10 నుంచి 15 టన్నుల గోదాములు కట్టిస్తామన్నారు. రైతులు తమ ధాన్యాన్ని తక్కువ ధరలకు అమ్ముకొకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలని రూ.500 బోనస్ పొందాలని కోరారు. దళారుల నుంచి ఎక్కువ ధరలు వస్తే అమ్ముకోవాలని సూచించారు. త్వరలో పేదలకు తెల్ల రేషన్ కార్డులు డిజిటల్ రూపంలో ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో కామారెడ్డి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్, మాజీ జడ్పీటీసీ అంబర్‌సింగ్, హరిదాస్, మాజీ చైర్మన్ మూడ్ కవిత అంబర్ సింగ్, వెలగపూడి గోపాల్, మాజీ సర్పంచ్ నెమని నాగమణి విరాజ్, కర్లం సాయరెడ్డి, సత్యనారాయణ, వెంకన్న, సుమలత రాంరెడ్డి, ప్యాక్స్ చైర్మన్ అశోక్, సుధాకర్‌రెడ్డి, అధ్యక్షులు హన్మంత్‌రెడ్డి, రాజారెడ్డి, మైనారిటీ అధ్యక్షులు ఏండి భారీ, నారగౌడ్, సీఈఓ శ్రీనివాస్, పలు గ్రామాల రైతులు, కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.


నూతన కార్యవర్గ సభ్యులతో పోచారం శ్రీనివాస్‌రెడ్డి, కాసుల బాలరాజ్

## సీపీఐ(ఎం) జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వెంకట్ గౌడ్



మాట్లాడుతున్న సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వెంకట్‌గౌడ్

**నవతెలంగాణ-కామారెడ్డి**

అక్టోబర్ 19న జరిగే సీపీఐ(ఎం) జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కామారెడ్డి జిల్లా కార్యదర్శి వెంకట్‌గౌడ్ అన్నారు. గురువారం జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సీపీఐ(ఎం) శాఖ మహాసభల నుండి అఖిల భారత మహాసభల వరకు జరుగుతున్నాయని మహాసభలలో ప్రజా సమస్యలపై భవిష్యత్తులో పోరాటాలు రూపొందించుకుంటామని తెలిపారు. కామారెడ్డి జిల్లా మహాసభలను అక్టోబర్ 19న కామారెడ్డి పట్టణంలో జరుగుతాయని, ఈ మహాసభలకు పార్టీ గ్రామస్థాయి నాయకులు, పార్టీ శ్రేణులు హాజరుకావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు మోతీరాంనాయక్, చంద్రశేఖర్, కొత్త నర్సింలు, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికులకు బకాయి వేతనాలు చెల్లించాలి

- తెలంగాణ గ్రామపంచాయతీ వర్కర్స్ అండ్ యూనియన్ (సీఐటీయూ) కార్యదర్శి జంగం గంగాధర్


వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

**నవతెలంగాణ-ఎడపల్లి**

గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికులకు, సిబ్బందికి బకాయి వేతనాలను పూర్తిస్థాయిలో చెల్లించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ గ్రామపంచాయతీ వర్కర్స్ అండ్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జంగం గంగాధర్ డిమాండ్ చేశారు. శుక్రవారం నిజామాబాద్ కలెక్టరేట్‌లోని డిపిఓ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మల్టీపర్పస్ విధానం రద్దు, సమాన పనికి సమాన వేతనం, పీఎఫ్, ఈఎస్ఐ ఇతర సమస్యలపై విన్నవించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు పద్మ కోశాధికారి సాగర్, ఎడపల్లి మండల నాయకులు గంగారాం, బోధన్ మండల అధ్యక్షురాలు రేఖ తదితరులున్నారు.

### కళాశాల విద్యార్థులు తరగతులకు హాజరయ్యే విధంగా

## మోటివేషనల్ తరగతులు నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

**నవతెలంగాణ-కామారెడ్డి/పిట్లం**

కళాశాల విద్యార్థులు తరగతులకు హాజరయ్యే విధంగా మోటివేషనల్ తరగతులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. గురువారం జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్‌తో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గత సంవత్సరం జిల్లాలో ఇంటర్మీడియట్ తరగతులలో ఉత్తీర్ణత శాతం రాష్ట్రంలో చివరి స్థానంలో ఉందని, ఈ సంవత్సరం ఉత్తీర్ణత శాతం చాలా పెంచాలని, అందుకు ముందస్తు ప్రణాళికలతో విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని అన్నారు. ముఖ్యంగా విద్యార్థులు క్లాసులకు తప్పనిసరిగా హాజరయ్యే విధంగా విద్యార్థులను ప్రోత్సహించాలని తెలిపారు. మోటివేషనల్ సినిమాలను ప్రదర్శించాలని సూచించారు. ప్రతీ నెలా పేరెంట్స్ సమావేశాలు నిర్వహించాలన్నారు. తరగతి గదిలో బోధన విషయాలతో పాటు, నోట్స్ ఇవ్వాలని సూచించారు. విద్యార్థులు పరీక్షలు సన్నద్ధులు కావడానికి ప్రత్యేక తరగతులు నిర్వహించాలని తెలిపారు. కొన్ని కళాశాలల్లో తక్కువ ఉత్తీర్ణత శాతం ఉందని, ఆ కళాశాలలో ప్రత్యేక తరగతులు నిర్వహించి బోధన అదించాలని తెలిపారు. విద్యార్థుల హాజరు విషయంలో ఆయా సబ్ కలెక్టర్, ఆర్డీఓల సహకారం తీసుకోవాలని సూచించారు. సబ్ కలెక్టర్, ఆర్డీఓలు కళాశాలలను విజిట్ చేయాలని తెలిపారు. ఐ.ఐ.టీ.లో అడ్మిషన్స్ పొందే విధంగా విద్యార్థులను తీర్చిదిద్దాలని అన్నారు. ఆర్టీసీ బస్సుల విషయం ఆర్టీసీ రీజనల్ మేనేజర్‌తో మాట్లాడతానని తెలిపారు. వచ్చే రోజుల్లో తన పర్యటనలలో జూనియర్ కళాశాలలను తనిఖీ చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ప్రిన్సిపాల్స్ మాట్లాడుతూ.. విద్యార్థులు అడ్మిషన్స్ తీసుకోవడం వరకు మాత్రమే జరుగుతున్నదని, తర్వాత క్లాస్‌లకు హాజరు కావడం లేదని, పొలం పనులకు, ట్రాక్టర్స్ నడపడానికి, ఇతర పనులకు వెళుతున్నారని తెలిపారు. గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చే విద్యార్థులకు ఆర్.టీ.సి. బస్సుల సౌకర్యం సరిగా లేదని, కళాశాలలు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు తరగతులు నిర్వహిస్తామని, సాయంత్రం 4 గంటల తరువాత బస్సులు లేకపోవడం వలన విద్యార్థులు 3 గంటలకు వెళ్లిపోతున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి సలాం, కళాశాలల ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.


పిట్లం : దంపింగ్‌యార్డు పనితీరును అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్

**డంపింగ్ నిర్వహణపై ఎంపీవో, సెక్రెటరీకి మెమోలు జారీకి ఆదేశం..**

**పిట్లం :** డంపింగ్ యార్డ్ నిర్వహణ, పరిసర ప్రాంతం సక్రమంగా లేని కారణంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ స్థానిక మండల పంచాయతీ అధికారి యాదగిరి, పిట్లం గ్రామపంచాయతీ సెక్రటరీ యాదగిరికి మెమో జారీ చేయాలని డిఎల్‌పిఓ నాగరాజ్‌ను ఆదేశించారు. గురువారం మండల కేంద్రాన్ని అకస్మికంగా పర్యటించి ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్ సెంటర్, డంపింగ్ యార్డ్, ఎల్ఆర్ఎస్ స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా డంపింగ్ యార్డ్‌లో నీరు నిండి ఉండడం, డంపింగ్ యార్డ్‌కు రహదారి సక్రమంగా లేని కారణంతో ఆగ్రహించారు. డంపింగ్ యార్డ్‌లో ఉన్న నీటి నిల్వలను సత్వరమే తొలగించాలని, చెత్త వేయుటకు రహదారి, పరిసర ప్రాంతం శుభ్రంగా ఉండేటట్లు చర్యలు తీసుకోవాలని డివిజనల్ పంచాయతీ అధికారులకు ఆదేశించారు. ముందుగా మండల కేంద్రంలోని నేషనల్ హైవే రుద్ర టీ పాయింట్ సర్వీస్ రోడ్డు పక్కన గల ఎల్ఆర్ఎస్ ప్లాట్లను పరిశీలించి వాటి వివరాలను తెలుసుకున్నారు. మండలంలో 1384 ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు ఉన్నప్పటికీ 89 దరఖాస్తులను పూర్తి చేయడంతో మిగిలిన దరఖాస్తులను సత్వరమే పూర్తిచేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. అనంతరం ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ పర్యటించి సిబ్బందిపై ఆరా తీసి రోగులతో అందుతున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. కాగా మెడికల్ స్టోర్ రూమ్ పరిశీలించి టాబ్లెట్స్, మందుల స్టాక్ రిజిస్టర్ తనిఖీ చేశారు. డాక్టర్ గదితోపాటు ప్రతి వార్డును క్షుణ్ణంగా పరిశీలించారు. సిబ్బందితో ఆసుపత్రికి కావలసిన సదుపాయాల గురించి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ వేణుగోపాల్, ఎంపీడీవో కమలాకర్, ఎంపీఓ యాదగిరి, సెక్రటరీ యాదగిరి, ఆసుపత్రి సూపరింటెండెంట్ రవీంద్ర మోహన్, డాక్టర్లు అబ్దుల్ సమద్, నిఖిల్, సుమతి, హెడ్‌నర్స్ శైలజ, ఫార్మసిస్ట్ సునీత, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీనివాస్, జిల్లా, డివిజనల్ అధికారులు పాల్గొన్నారు.

## నుడా చైర్మెన్‌గా కేశవేణు



**నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ**

నిజామాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటి (నుడా) చైర్మెన్‌గా కేశ వేణును నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. నిజామాబాద్ నగరానికి చెందిన కేశ వేణు ప్రస్తుతం నగర కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఉన్నారు. ఆయనకు కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి నియామకపత్రాన్ని అందజేశారు.

## కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

- మార్క్ ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డి
- సోయాబీన్ కొనుగోలు కేంద్రం ప్రారంభం

**నవతెలంగాణ-కమ్మర్‌పల్లి**

రైతుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన సోయాబీన్ కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మార్క్ ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ చొరవతో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సోయాబీన్ కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మార గంగారెడ్డి మాట్లాడుతూ.. దాదాపు పది సంవత్సరాల తర్వాత తొలిసారిగా నియోజకవర్గ రైతాంగం పంట విక్రయంలో నష్టపోవద్దని ఆలోచించి వేల్పూర్, కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. కొనుగోలు కేంద్రానికి వచ్చి సోయాబీన్ పంటను విక్రయించి మద్దతు ధరను పొందాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పాలెపు నర్సయ్య, వైస్ చైర్మన్ సుంకేట బుచ్చన్న, కమ్మర్‌పల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సుంకెట రవి, జిల్లా కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు పడిగెల ప్రవీణ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు బూత్ పురం మహిపాల్, రంజిత్, జైడి మధులత శ్రీనివాస్, మైనార్టీ సెల్ జిల్లా గౌరవ అధ్యక్షులు అబ్దుల్ రఫీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మార్క్‌ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డి

## చిమ్మచీకట్లోనే బతుకమ్మ సంబురాలు

- ఇబ్బందులు పడ్డ మహిళలు
- కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయని అధికారులు
- ఘనంగా నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించినా పట్టించుకోని వైనం

**నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్**

బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించినా.. కొందరు అధికారులు మాత్రం ఎలాంటి ఏర్పాట్లు చేయలేదు. అందుకు నిదర్శనం పెద్దకొడప్‌గల్ మండల కేంద్రమే. మండల కేంద్రంలో మహిళలు గురువారం సాయంత్రం బతుకమ్మ ఆడి.. చెరువు వద్ద నిమజ్జనం చేసే సమయంలో చెరువు వద్ద కనీస సౌకర్యాలు లేవని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలు ఎంతో ఘనంగా జరుపుకునే పండుగకు అధికారులు ఏర్పాట్లు చేయకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. బతుకమ్మలను చెరువులో దిగి నిమజ్జనం చేసే సమయంలో సెల్‌ఫోన్ టార్చ్ లైట్ వెలుగుతో ప్రక్రియ పూర్తి చేయాల్సి వచ్చిందని మహిళలు పేర్కొన్నారు. పండుగ పూట ఏదైనా విషాదం జరిగితే బాధ్యులు ఎవరని మహిళలు ప్రశ్నించారు.


చీకట్లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

## మేకలకు ట్యాగ్‌లు

- దసరా పండుగకు అమ్మొద్దు
- 'ఆపరేషన్ గోట్' కథనానికి స్పందన

**నవతెలంగాణ-నవీపేట్**

'ఆపరేషన్ గోట్' అనే శీర్షికన నవతెలంగాణలో గురువారం ప్రచురితమైన కథనానికి మండల పశువైద్యాధికారులు స్పందించారు. మండలంలోని ఆశనగర్ శివారులో గుట్టుచప్పుడు కాకుండా మేకలలో రాళ్ల పెంచుతున్న గుడారాలకు వెళ్లి మండల పశు వైద్యాధికారులు నరేందర్‌రెడ్డి, రతన్, పంచాయతీ కార్యదర్శి రవీందర్ నాయక్ సిబ్బందితో కలిసి వెళ్లి పరిశీలించారు. మేకల పొట్ట భాగంలో కుట్లను పరిశీలించి పెంపకం దారులను ప్రశ్నించగా.. మేకలలో రాళ్ల పెంపకం వాస్తవమేనని తేలడంతో మేకలకు ట్యాగ్‌లను వేసి దసరా పండుగకు అమ్మవద్దని ఆదేశించారు. సోమవారం వచ్చి మేకలను పరిశీలిస్తామని అప్పటివరకు అమ్మకాలు జరిపితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని పెంపకందారులను హెచ్చరించారు.






# నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
# నిజామాబాద్
శుక్రవారం | అక్టోబర్ 11, 2024 | www.navatelangana.com



## పెద్దమ్మ ఆలయంలో అన్న వితరణ


పూజల్లో పాల్గొన్న మహిళలు

**నవతెలంగాణ-కమ్మర్‌పల్లి**
మండలకేంద్రంలోని పెద్దమ్మ ఆలయ ప్రాంగణంలో దేవీ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా కుంకుమార్చన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. పూజల అనంతరం భక్తులకు, గ్రామస్తులకు అన్న వితరణ చేశారు. ప్రజలు పెద్ద సంఖ్యల్లో హాజరై అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. మండలంలోని ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన దుర్గ దేవి మండపాల్లో అమ్మవారు 8వ రోజు భైరవి, శాకంబరి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

## రాంపూర్ (డి)లో బోనాల ఉత్సవాలు


బోనాలతో వెళ్తున్న గ్రామస్తులు

**నవతెలంగాణ-డిచ్‌పల్లి**
మండలం లోని రాంపూర్ డి గ్రామంలో గత 22 ఏళ్ళుగా ఫ్రెండ్స్ యూత్ క్లబ్, భవాని స్వాముల ఆధ్వర్యంలో నవరాత్రుల ఉత్సవాలలో భాగంగా బోనాల ఊరేగింపు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా గురువారం బోనాల ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని శ్రీలక్ష్మి నరసింహ ఆలయం నుండి ఈ బోనాల ఉత్సవాలను గ్రామాభివృద్ధి కమిటీ, గ్రామస్తుల సహాయ సహకారాలతో నిర్వహించినట్లు గ్రామస్తులు తెలిపారు. కార్యక్రమంలో ఫ్రెండ్స్ యూత్ క్లబ్ సభ్యులు, భవాని స్వాములు, విడిసి సభ్యులు, గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.

## మహా చండియాగం


యాగంలో పాల్గొన్న భక్తులు

**నవతెలంగాణ-మోపాల్**
మెపాల్‌లో శ్రీ దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీ దుర్గ మాత కమిటి సభ్యుల అధ్వర్యంలో గురువారం దుర్గాదేవి అవతారం సందర్భంగా కమిటీ సభ్యులు మహా చండి యాగం(యజ్ఞం) నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దుర్గ మాత కమిటి సభ్యులు, భక్తులు, స్వాములు, మహిళలు, యువకులు అధిక సంఖ్యలో యజ్ఞంలో పాల్గొన్నారు.

## ముప్కాల్ వీడీసీ అధ్యక్షులుగా సిద్ధ రమేష్



**నవతెలంగాణ-ముప్కాల్**
ముప్కాల్ గ్రామాభివృద్ధి కమిటీ నూతన అధ్యక్షులుగా సిద్ద రమేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అదేవిధంగా కమిటీ కార్యవర్గ సభ్యులుగా నేర నర్సయ్య (సెక్రటరీ), కోశాధికారిగా ముస్కు చిన్న నర్సయ్య, జాయింట్ సెక్రటరీగా అంగు రాజేందర్, ఉపాధ్యక్షులుగా కుమ్మరి పెద్ద రాజేశ్వర్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు మాజీ గ్రామాభివృద్ధి కమిటీ మాజీ అధ్యక్షులు కనుగుంట లింగం గురువారం తెలిపారు. అనంతరం నూతన అధ్యక్షులు సిద్ధ రమేష్ మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధి కోసం తనవంతు కృషి చేస్తానని, అభివృద్ధికి తోడ్పాటు అందిస్తానని అన్నారు. కార్యక్రమంలో మాజీ గ్రామాభివృద్ధి కమిటీ సెక్రటరీ గడ్డం పెద్ద గంగారెడ్డి, కమిటీ సభ్యులు చింతకింది గణేష్, పన్నీరు ప్రకాష్, గోపి మహేష్, శ్రీనివాస్ ఆయా కుల సంఘాల పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## నేడు పట్టణంలో ఎమ్మెల్యే పర్యటన

**నవతెలంగాణ-ఆర్మూర్**
ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి ఆలూర్-ఆర్మూర్ మండలాల కళ్యాణ లక్ష్మి-షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో శుక్రవారం పాల్గొంటున్నట్టు బిజెపి అసెంబ్లీ కన్వీనర్ పాలెపు రాజు గురువారం తెలిపారు. పట్టణంలోని క్షత్రియ ఫంక్షన్ హాల్‌లో బీసీ వెల్ఫేర్ శాఖ ఆధ్వర్యంలో నియోజకవర్గ గీత కార్మికులకు పంపిణీ చేసే కాటమయ్య రక్షణ కిట్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటున్నట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి కార్యకర్తలు, నాయకులు, మీడియా మిత్రులు హాజరుకావాలని కోరారు.

## జ్వరం వస్తే ప్రభుత్వ వైద్యాధికారిని సంప్రదించాలి

- రాంపూర్‌లో డెంగ్యూ వ్యాధి పై అవగాహన
- జిల్లా మలేరియా అధికారి తుకారాం రాథోడ్


మాట్లాడుతున్న జిల్లా మలేరియా అధికారి తుకారాం రాథోడ్

**నవతెలంగాణ-డిచ్‌పల్లి**
జ్వరం వస్తే వేంటనే ప్రభుత్వ వైద్యాధికారిని సంప్రదించాలని, ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి జిల్లా మలేరియా అధికారి తుకారాం రాథోడ్ అన్నారు. గురువారం డిచ్ పల్లి మండలంలోని రాంపూర్ (డి) గ్రామంలో డెంగ్యూ వ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా డాక్టర్ తుకారం రాథోడ్ మాట్లాడుతూ..జ్వరం వస్తే వెంటనే ప్రభుత్వ వైద్యాధికారిని సంప్రదించి ల్యాబ్లో ఉచిత రక్తపరీక్షలు చేయించు కోవాలని సూచించారు. తీవ్రమైన జ్వరం వచ్చేవరకు వేచి ఉండకుండా ఒక్కరోజు జ్వరం రాగానే వెంటనే రక్త పరీక్షలు చేయించుకుని తగిన మందులు తీసుకోవాలని తెలిపారు. గ్రామంలో జరిగిన డెమో ఫాస్ స్ప్రే, ఫాగింగ్, ఫైరిత్రిన్ స్ప్రే అన్నింటిని పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ తారా చంద్ నాయక్, మండల ప్రత్యేక అధికారి యోహన్, తహసిల్దార్ ప్రభాకర్, డిప్యూటీ తహసిల్దార్ శ్రీ కాంత్, ఆర్ఐ సంతోష్, ఎంపిఓ శ్రీనివాస్ గౌడ్,మండల వైద్యాధికారి డాక్టర్ సంతోష్ కుమార్, ఆరోగ్య విస్తరణ అధికారి వై.శంకర్, మాజీ సర్పంచ్ తిరుపతి, రాజ్ కుమార్, మాజీ ఉప సర్పంచ్ ఎంకనోల్ల రమేష్,రవి, అంగన్వాడీ టీచర్లు, ఆరోగ్య కార్యకర్తలు స్వర్ణలత, రేణుక,ఆశ కార్యకర్తలు, విడిసి సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## సేవా కార్యక్రమాలతో ముందుకు వెళ్లాలి

- బీసీ సంక్షేమ వేదిక జిల్లా అధ్యక్షులు సుంకం భూషణ్


మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షులు సుంకం భూషణ్

**నవతెలంగాణ-ఆర్మూర్**
ప్రతి ఒక్కరు తమకు తోచిన సేవా కార్యక్రమాలతో ముందుకు వెళ్లాలని బిసి ఎస్సి, ఎస్టీ మైనారిటీ సంక్షేమ వేదిక జిల్లా అధ్యక్షులు సుంకం భూషణ్ అన్నారు. మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి తపస్వి స్వచ్ఛంద సేవా సంస్థలో గురువారం ఆయన పుట్టినరోజు సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన స్వగ్రామం పిప్రి పాఠశాలలో నిరుపేద విద్యార్థులకు సహాయం అందజేస్తున్నటు తెలిపారు. కార్యక్రమంలో తపస్వి స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు పాల్గొనారు.

# డంపింగ్ యార్డుల్లా నగర రోడ్లు

- తొలగించడంలో మున్సిపల్ అధికారులు విఫలం
- తమకేం పట్టనట్టు కార్పొరేటర్ల తీరు !


రోడ్డుపక్కనే వేసిన చెత్త

**నవతెలంగాణ-కంఠేశ్వర్**
నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ప్రధాన రోడ్డు పక్కనే చెత్తను వేయడంతో డంపింగ్ యార్డుల్లా మారాయి. రోడ్లపక్కనే చెత్తను నిత్యం తొలగించకపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. చెత్తను ఎప్పటికప్పుడు తొలగించడంలో నిజామాబాద్ మున్సిపల్ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం చేస్తున్నారని నగర ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల పర్యటనలు ఉన్నప్పుడు మాత్రమే రోడ్లను, కాలనీలను శుభ్రం చేయిస్తున్నారని మిగతా సమయంలో పట్టించుకునే నాధుడే కరువయ్యారని ప్రజలు వాపోతున్నారు. ఫిర్యాదులు వచ్చిన చోట మాత్రమే శుభ్రం చేయిస్తూ చేతులు దులుపుకుంటున్నారని తెలుస్తోంది.

నగరంలో ఎక్కడ చూస్తే అక్కడ చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. నగరంలో అనేక కాలనీలు, బస్తీల్లో అపరిశుభ్రత తాండవిస్తోంది. దగ్గరుండి సిబ్బందితో పనులు చేయించవలసిన అధికారులు కార్యాలయానికి పరిమితి కావడంతో పారిశుధ్యం పడకేస్తోందన్న ఆరోపణలు ఉన్నాయి. బస్తీలు మురికి కుప్పల్లా తయారు అవడానికి అధికారులు, పాలకులే కారకులని అంటున్నారు. ఇంటింటా చెత్తను సేకరించడానికి వాహనాలు వినియోగిస్తున్నారు. అవీ నిత్యం వస్తున్న దాఖలాలు లేవని, దీంతో చెత్తంతా రోడ్లపక్కన వేస్తున్నారని పలువురు వాపోతున్నారు. దీంతో దోమలు, దుర్వాసనతో ఇబ్బందులకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చెత్త కుప్పల శాశ్వత తొలగింపుపై అధికారుల శ్రద్ధ చూపడంలేదు. వర్షాకాలంలో చెత్తకుప్పల వల్ల వచ్చే వ్యాధులకు బాధ్యులు ఎవరు అని ప్రజలు వాహనదారులు ప్రశ్నిస్తున్నారు. వర్షాలు కొరయడంతో రోడ్లపై నీరు చేరి చెత్త సైతం పేరుకు పతుంది. ఒకవేళ రెండు మూడు రోజులు వర్షం కురిస్తే మాత్రం సంగతి అంతే. చెత్త తీసే వరకు ఆ ప్రాంతం వైపు సంబంధిత శాఖ అధికారులు చూసి చూడనట్టు వ్యవహరించడం గమనార్హం. ఇప్పటికే నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ప్రధానంగా డెంగ్యూ, టైఫాయిడ్, చికెన్ గున్యా వంటి విష జ్వరాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. అధికారులు మున్సిపల్ సిబ్బంది మాత్రం విష జ్వరాలు ఎక్కడైతే ఎక్కువగా ఉంటున్నాయో ఆ ప్రాంతాలకు వెళ్లి మందును పిచికారి చేస్తూ వస్తున్నారు తప్ప చెత్తను తొలగించడంలో చర్యలు మాత్రం తీసుకోవడం లేదు.

నిజామామాద్ నగరంలో రోడ్లపై ఎక్కడపడితే అక్కడ చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. మరి ఇంటింటా చెత్త సేకరిస్తుంటే రోడ్లపై చెత్త కుప్పలు ఎందుకు దర్శనమిస్తున్నాయో మున్సిపల్ కమిషనర్, మెడికల్ అధికారులకు స్థానిక ఎమ్మెల్యేలకే తెలియాలి. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో బస్తీలు చెత్తకుప్పల్లా తయారవడానికి కారణమవుతున్నారు. ఇక కార్పొరేటర్ల కైతే ఈ సమస్య పట్టనే పట్టదు. నిజామాబాద్ జిల్లాకేంద్రంలో శానిటేషన్ పరిస్థితి అస్తవ్యస్తంగా మారిందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎక్కడపడితే అక్కడ చెత్త దర్శనమిస్తుంది. నగరంలోని బస్టాండ్ నుండి కంటేశ్వర్ వరకు, కంటేశ్వర్ బైపాస్, అలాగే అర్సపల్లి మార్గం, నటరాజ్ థియేటర్, మార్కెట్ ప్రాంతం, తదితర ప్రాంతాలలో అడుగుపెట్టగా మెయిన్ రోడ్డుపైన ముందుగా దర్శనమిచ్చేది చెత్తకుప్పే, జనావాసాలు మొదలయ్యే స్థలంలోనే ఈ చెత్త కుప్పలు దానికి సమీపంలో తినుబండార షాప్‌లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు మొదలైనవి ఉన్నాయి. రోడ్డుపక్కన చిన్నపాటి డంపింగ్ యార్డులు తయారయ్యాయి. ఇక్కడి నుంచి పెద్ద వాహనంలో చెత్త సేకరణ చేస్తారు. అయినా కానీ అధికారులు బస్తీ ప్రధాన రహదారిలో చెత్త వేయకుండా తీసుకున్న చర్యలు మాత్రం శూన్యం. చెత్తాచెదారం వల్ల దోమలు, ఈగలు పెరిగి కాలనీ వాసులు అనారోగ్యానికి కారణం అవుతుంది. ఈ సమస్యపై స్థానిక కార్పొరేటర్లు ఏరోజు స్పందించిన దాఖలాలు లేవు. ఇలా ఒకటి కాదు రెండు కాదు ఇంచుమించుగా నిజామాబాద్ మున్సిపల్ పరిధిలో ఉన్న అన్ని డివిజన్లో కాలనీ, బస్తీల్లో ఇదే పరిస్థితి ఉందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన నిజామాబాద్ మున్సిపల్ ఉన్నతాధికారులు స్పందించి చెత్తకుప్పలను ఎప్పటికప్పుడు తొలగించి ఇంటింటా చెత్త సేకరణ చేసే విధంగా పకడ్బందీగా చర్యలు చేయాలని సూచిస్తున్నారు.



ప్రధాన రోడ్డుపక్కన చెత్త

# మానసిక ఆరోగ్యం మహాభాగ్యం


ఫోమ్ బోర్డులను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

**నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ**
మానసిక ఆరోగ్యం మహాభాగ్యం అని జిల్లా పాలనాధికారి రాజీవ్‌గాంధీ హనుమంతు అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని టెలిమానస్ టోల్ ఫ్రీ నెంబర్ గల ఫోమ్ బోర్డులను గౌరవ కలెక్టర్, జిల్లా మెజిస్ట్రేట్ రాజీవ్ గాంధీ హనుమంతు చేతుల మీదుగా వారి ఛాంబర్‌లో విడుదల చేసినట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ బి.రాజశ్రీ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా పాలనాధికారి రాజీవ్‌గాంధీ హనుమంతు మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా విద్యార్థులు, యువకులు, మహిళలు, ప్రజలందరికీ మానసిక ఆరోగ్యంపై విస్తృతంగా అవగాహన కల్పించడంతోపాటు ముఖ్యమైన ప్రదేశాల్లో, కలెక్టర్ ఆఫీసులో ఈ బోర్డులను ప్రదర్శించాలన్నారు. తర్వాత జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని కార్యాలయంలోని మీటింగ్ హాల్‌లో నిర్వహించిన వర్క్ షాప్‌లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ బి రాజశ్రీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్‌ఓ మాట్లాడుతూ.. మానసిక ఆరోగ్యంపై అనేక సూచనలు ఇవ్వడమే కాకుండా ఉద్యోగులందరూ మానసిక ఒత్తిడికి గురికాకుండా వారి వారి రోజువారి విధుల్లో చక్కని ప్రణాళికతో నిర్వహించినట్లయితే ఎటువంటి మానసిక ఒత్తిడికి గురికారని తెలిపారు. వర్క్‌షాప్‌లో అవగాహన కలిగించడానికి విచ్చేసిన జిల్లా మానసిక ఆరోగ్య కార్యక్రమం అధికారి డాక్టర్ రవితేజ ఇన్నమూరి మాట్లాడుతూ.. మానసిక ఆరోగ్యాన్ని మించిన సంపద మరొకటి లేదన్నారు. చిన్న చిన్న సమ స్యలకు భయపడకుండా ధైర్యంగా ఎదు ర్కోవాలని సూచించారు. ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుందని తెలిపారు. అనవసర ఆందోళనలతో ఆత్మహత్యల వంటి తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని కోరారు. మానసిక ఒత్తిడితో బాధపడేవారు టోల్ ఫ్రీ నెంబర్ 14416కు ఫోన్ చేసి ఉచిత కౌన్సిలింగ్ సహాయం పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డా బి రాజశ్రీ, ఎన్ హెచ్ ఎం ప్రోగ్రాం అధికారి డాక్టర్ రాజు, జిల్లా పి ఓ - ఎన్ సి డి అధికారి డాక్టర్ వినీత్ రెడ్డి కార్యాలయ పర్యవేక్షకులు చందర్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ వెంకటేష్, జిల్లా ఆరోగ్య విద్య బోధకులు ఘన్ పూర్ వెంకటేశ్వర్లు, స్వామి సులోచన, డిపిఓ విశాల కార్యాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## దృష్టిలోప దినోత్సవం సందర్భంగా వైద్యశిబిరం



బాల్కొండ: మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో రమేష్

**నవతెలంగాణ-బాల్కొండ**
ప్రపంచ దృష్టి లోప దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వైద్యాధికారి డాక్టర్.రాజశ్రీ ఆదేశాల మేరకు గురువారం మండల పరిధిలోని కిసాన్ నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్‌ఓ రమేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రమేష్ మాట్లాడుతూ.. యువత, విద్యార్థులు టీవీ, సెల్ ఫోన్‌కు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమానికి కంటి వైద్యనిపుణులు డాక్టర్ నరేష్ పాల్గొని విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించి 35 సంవత్సరాలు దాటిన వారు కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వృద్ధాప్యంలో వచ్చే మోతిబిందుని అశ్రద్ధ చేయొద్దని తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ ఐశ్వంత్, అప్తాలమిక్ ఆఫీసర్ బుజంగా రెడ్డి, సిహెచ్‌ఓ గిరిబాబు, సబ్ యూనిట్ అధికారి సాయి, రవి, వీరయ్య ఆరోగ్య కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

**ధర్పల్లి :** కొన్ని వందల కెమెరాల మెగాపిక్సెస్ మన కంటి దృష్టికి సమానం. మరి అంతటి అద్భుతమైన నయనాలను కాపాడుకుందామని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుశాంత్ రెడ్డి, ఆప్తమిక్ ఆఫీసర్ హరినాథ్ నెహ్రూ అన్నారు. ఈ సందర్భంగా ఆప్తమిక్ ఆఫీసర్ మాట్లాడుతూ.. ప్రపంచ నేత దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య సిబ్బందిచే ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. మన కంటిని చాలా జాగ్రత్తగా కాపాడుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో నర్సింగ్ ఆఫీసర్ అరుణలత, దినేష్, సిబ్బంది కష్ణ, పద్మ, మురళి, సంతోష్, నరేందర్, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.


ధర్పల్లిలో..

## పీఆర్టియు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షునిగా కుంట శ్రీనివాస్‌రెడ్డి



**నవతెలంగాణ-ఆర్మూర్**
మండలంలోని జడ్పీహెచ్ఎస్ మిర్దాపల్లి ప్రధానోపాధ్యాయులు కుంట శ్రీనివాస్ రెడ్డి రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా మూడవ సారి ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. వీరి ఎంపిక పట్ల ఉపాధ్యాయులు మిర్దాపల్లి గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన ఎంపికకు కృషిచేసిన జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పొద్దుటూరి మోహన్ రెడ్డి, గంగోనే కిషన్, ఆలూరు మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు గజ్జి సాయన్న, శివప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## ఖానాపూర్‌లో అన్నదానం

**నవతెలంగాణ-ఆర్మూర్**
మండలంలోని ఖానాపూర్ గ్రామంలో గురువారం దుర్గామాత ఉత్సవాల్లో భాగంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సింగిరెడ్డి కుటుంబ పరివారం తరపున జరిగిన అన్నదాన కార్యక్రమంలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సింగిరెడ్డి మోహన్, రేషన్ డీలర్ సాయన్న, ప్రభుత్వ ఉపాధ్యాయురాలు లావణ్య తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

- సంస్థ డైరెక్టర్ సుంకం శ్రీనివాస్

**నవతెలంగాణ-డిచ్‌పల్లి**
స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 22 శిక్షణలు ప్రారంభం కానున్నాయని, అర్హులైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సంస్థ డైరెక్టర్ సుంకం శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మహిళలకు అందజేసే శిక్షణలు బ్యూటీ పార్లర్ (30 రోజులు), మగ్గం వర్క్ శిక్షణ(30 రోజులు), టైలర్ శిక్షణ (30 రోజులు) ఉంటుందని డైరెక్టర్ సుంకం శ్రీనివాస్ వివరించారు. ఆసక్తి గల 19 నుండి 45 ఏళ్ల వయస్సు ఉండి నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల గ్రామీణ ప్రాంత యువతులు అర్హులన్నారు. శిక్షణకు వచ్చే వారు తమ వెంట ధృవీకరణ పత్రాలు ఆధార్ కార్డు, రేషన్ కార్డ్, పదోతరగతి మెమో, ఐదు ఫోటోలు తీసుకొని వచ్చి దరఖాస్తు చేసుకోవాలని సంస్థ డైరెక్టర్ సుంకం శ్రీనివాస్ తెలిపారు. శిక్షణా సమయంలో భోజనం, హాస్టల్ వసతి, శిక్షణా పూర్తిగా ఉచితంగా అందచేస్తమని, శిక్షణ అనంతరం ధృవీకరణ పత్రం, టూల్ కిట్ అందచేయడం జరుగుతుందని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. చిరునామా టిటిడిసి క్యాంపస్, వెలుగు ఆఫీస్ పక్కన డిచ్ పల్లి ఘన్ పూర్ మరిన్ని వివరాలకు ఫోన్ నెంబర్. 08461-295428.

## పట్టు చీరల వితరణ

**నవతెలంగాణ-ఆర్మూర్**
మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి దుర్గామాతకు గురువారం ఆర్ ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ డైరెక్టర్ పైడి సుచరితరెడ్డి చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కలిగోట గంగాధర్, చిన్నారెడ్డి, స్వభావికా గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రంథాలయ చైర్మన్‌ను సన్మానించిన న్యాయవాదులు

నవతెలంగాణ-భిక్కనూర్

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా నియామకమైన మద్ది చంద్రకాంత్‌రెడ్డిని కామారెడ్డి జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ పూర్వ అధ్యక్షులు గజ్జల బిక్షపతి, అతిమాముల శ్రీధర్ గురువారం ఆయన నివాసంలో కలిసి శాలువాతో ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సంద ర్భంగా చంద్రకాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలో విద్యాభివృద్ధికి గ్రంథాలయాల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానన్నారు. కార్యక్రమంలో రామేశ్వర్‌పల్లి వీడిసి నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.


చైర్మన్‌ను సన్మానించిన న్యాయవాదులు

## తపాలా దినోత్సవం సందర్భంగా సన్మానం

నవతెలంగాణ-భిక్కనూర్

జాతీయ తపాలా దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక తపాలా కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బందికి భారతి ఫౌండేషన్ వ్యవస్థాపకులు లింగాల రాజబాబుగౌడ్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారతదేశంలో ప్రతి సంవత్సరం అక్టోబర్ 10న జాతీయ తపాలా దినోత్సవంగా 150 సంవత్సరాలకుపైగా భారతీయ తపాలా శాఖ కమ్యూనికేషన్ రంగంలో పోషించిన పాత్రను, పనిచేస్తున్న ఉద్యోగుల సేవలు చిరస్మరణీయమని అన్నారు. ఆధునిక ప్రపంచంలో ఎన్నో కొత్త టెక్నాలజీ వచ్చినప్పటికీ తపాలా శాఖకు ప్రత్యేక గుర్తింపు ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో తపాలా సిబ్బంది సురేష్, రామచంద్రం, బాల్ నర్సింలు, ఫౌండేషన్ సభ్యులు రాకేశ్, శ్రీనివాస్, రాజు, రవి, నరేష్, సురేష్, చంద్రశేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# సేవ చేయడానికి ముందుకు రావాలి

- సామాజిక కార్యకర్త ఎంఏ హకీమ్
- పేదలకు సేవచేస్తున్నందుకు స్నేహితుల సత్కారం


మాట్లాడుతున్న పలువురు

నవతెలంగాణ-పోతంగల్

సేవ చేయడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని సామాజిక కార్యకర్త ఎంఏ హకీమ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో సామాజిక కార్యకర్త ఎంఏ హకీమ్ చేస్తున్న సేవలను గుర్తించి తోటి స్నేహితులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా హకీమ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం అందరికీ సేవ చేయలేదని, ఒక టీంగా ఏర్పడి సేవ చేయాలని తెలిపారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో పోటీ చేసే విషయం, అందరి నిర్ణయంపై ఆధారపడి ఉంటుందన్నారు. జీవితాంతం సేవ చేస్తూనే ఉంటానన్నారు. ప్రజాసేవలో రాజకీయాలకు అతీతంగా ఉంటానని, సేవ కులమతాలకు అతీతంగా ఉండాలని తెలిపారు. ప్రజల కోసం పనిచేసే నాయకులు ఉండాలన్నారు. పాఠశాలలో తనతో చదువుకున్న స్నేహితులు రిటైర్డ్ డిఈ మోరే కిషన్, ప్రభుత్వ ఉపాధ్యాయులు నాగయ్య, రిటైర్డ్ ఎస్సై భీమయ్య, సజ్జిద్ హకీమ్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ జడ్పీటీసీ పుప్పాల శంకర్, జల్లపల్లి ఫారం మాజీ సర్పంచ్ షేరు, సుగుణాకర్‌రెడ్డి, యార్లగడ్డ సాయిబాబు, ఫిరోజ్, పబ్బ శేఖర్, ఎమ్మార్పీఎస్ మండల ఉపాధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

సోయా కొనుగోలు కేంద్రాన్ని

# సద్వినియోగం చేసుకోవాలి

- ఏఎంసీ చైర్మన్ అంకు సంధ్యదాము
- సోయా కొనుగోలు కేంద్రం ప్రారంభం


సోయ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏఎంసీ చైర్మన్ అంకు సంధ్యదాము

నవతెలంగాణ-బోధన్

సోయా కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఎంసీ చైర్మన్ అంకు సంధ్యదాము అన్నారు. గురువారం బోధన్ సొసైటీ ఆధ్వర్యంలో మావందిఖుర్దు గ్రామంలో సోయా కొనుగోలు కేంద్రాన్ని ఏఎంసీ చైర్మెన్ అంకు సంధ్యదాము ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతుల సౌకర్యార్థం ప్రభుత్వం ఏర్పాటు చేసిన సోయా కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. సోయా కొనుగోలు కేంద్రాలలోనే రైతులకు క్వింటాకు రూ.4892 మద్దతు ధర లభిస్తుందని తెలిపారు. కావున రైతులు దళారులను ఆశ్రయించి నష్టపోవద్దన్నారు. అలాగే రైతులకు 25 కిలోల శనగ విత్తనాలను రూ.2200కి పంపిణీ చేశారు. అనంతరం అంకు సంధ్యదాము, ఏఎంసీ వైస్ చైర్మెన్ చీల శంకర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మెన్ ఉద్మీర్ లక్ష్మణ్, డైరెక్టర్లు బీర్కూర్ శంకర్, తొకల సాయన్న, బేగరి పోశెట్టి, భాస్కర్, వసంత్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ దాము, నాయకులు పాషా, సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

## చెరువుల వద్ద విద్యుత్ దీపాల ఏర్పాటు

నవతెలంగాణ-భిక్కనూర్

పట్టణ కేంద్రంలోని చెరువుల వద్ద గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో బతుకమ్మ పండుగ సంబరాల సందర్భంగా విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. మండలంలోని ప్రతి గ్రామంలో చెరువులో బతుకమ్మలు నిమజ్జనం సందర్భంగా మహిళలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పంచాయతీ కార్యదర్శుల చేత ముందస్తు చర్యలు తీసుకున్నట్లు ఎంపీడీవో రాజ్ కిరణ్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మహేష్ గౌడ్, సిబ్బంది తదితరులున్నారు.

## బోధన్ గ్రామాభివృద్ధి కమిటీ ప్రమాణ స్వీకారం


ప్రమాణ స్వీకారం చేస్తున్న పలువురు

నవతెలంగాణ-బోధన్

బోధన్ గ్రామాభివృద్ధి కమిటీకి జరిగిన ఎన్నికల్లో భాగంగా గెలుపొందిన పాలకవర్గ ప్రతినిధులు బోధన్ పట్టణంలోని మహాలక్ష్మి ఆలయ కళ్యాణ మండపంలో అధ్యక్ష, కార్యదర్శులు, పాలకవర్గ సభ్యులు గురువారం ఘనంగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారులుగా వ్యవహరించిన అజయ్ వడిగా, పోశెట్టి ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం నూతన అధ్యక్షులు గంగాధర్‌రావు పట్వారీ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులుగా ఎన్నుకున్న కుల సంఘాల నాయకులకు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ శరత్‌రెడ్డి, కుల సంఘాల పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయులకు ఘన సన్మానం


ఎంపికైన ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పలువురు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఇటీవల వెలువడిన డీఎస్సీ ఫలితాలలో ఎల్లా రెడ్డి మండలం నుంచి నూతనంగా ఉపాధ్యా యులుగా ఎంపికై సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామకప త్రాలు అందుకున్న పలువురిని ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని గ్రంథాలయంలో గురువారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కురుమ సాయిబాబా ఆధ్వర్యం లో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థు లను భావిభారత ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే పవిత్రమైన ఉపాధ్యాయ వృత్తిలో చోటు సంపాదించిన అందరినీ అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్ది దేశ ప్రగతి అభ్యున్నతికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ గోపికృష్ణ, మున్సిపల్ చైర్మన్ శ్రీకాంత్, కౌన్సిలర్ నీలకంఠం, అల్లం శ్రీను, కాంగ్రెస్ నాయకులు తిరుపతి, పోచయ్య, నునుగొండ శ్రీనివాస్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## పైప్ వేయించి సమస్యను పరిష్కరించిన కౌన్సిలర్


పనులు నిర్వహిస్తున్న పలువురు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి పురపాలక సంఘం పరిధిలోని 1వ వార్డు పన్నాలాల్ కాలనీలో ఇటీవల నూతనంగా నిర్మించిన మురికి కాలువపై నుంచి వెళ్లే దారిలో రాకపోకలకు స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారని గమనించిన వార్డ్ కౌన్సిలర్ అల్లం శ్రీను గురువారం ప్రత్యేక చొరవ తీసుకొని మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రాజుకు సమస్యను తెలియజేసి ఆయన సహకారంతో పైపు వేయించి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పైనుంచి ఫ్లోరింగ్ చేయించారు. ప్రధాన దారిలో ప్రమాదకరంగా మారిన సమస్యను పరిష్కరించడంతో స్థానికులు ఆయనకు అభినందనలు తెలిపారు. ప్రజా సేవకుడిగా ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని ఆయన తెలిపారు.

## ఎంపీ సురేష్ కుమార్‌ను కలిసిన చందూర్ నాయకులు


ఎంపీని కలిసిన నాయకులు

నవతెలంగాణ-వర్ని

వర్ని వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమానికి విచ్చేసిన సందర్భంగా జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ శెట్కార్ చందూర్ మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి మాట్లాడారు. చందూర్ ఫ్యాక్స్ చైర్మన్ ప్యారం అశోక్ యాదవ్ మండలంలో రైతులు పంట నష్టాలను తెలిపారు. అకాల వర్షంతో చాలా మంది రైతులు నష్టపోయారని అన్నారు. ఆయనతో పాటు గ్రామ మాజీ సర్పంచ్ కె.సాయిరెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీనివాస్ గౌడ్, కమిటీ డైరెక్టర్ వి.సుధాకర్‌రావు, మాదరపు రాంరెడ్డి, గొర్తి వెంకటేశ్వరరావు, శ్రీనివాస్‌రెడ్డి, మాదరపు రాజిరెడ్డి తదితరులున్నారు.

## దుర్గామాత వద్ద మహా అన్నదానం

నవతెలంగాణ-మద్నూర్

మండల కేంద్రంలోని హౌసింగ్ బోర్డ్ టీచర్స్ కాలనీలో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపం వద్ద కాలనీవాసులు ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమాన్ని గురువారం చేపట్టారు. మహా అన్నదానంలో కాలనీ వాసులు పాల్గొన్నారు.

## సురేష్ షెట్కార్‌ను కలిసిన మాజీ అధ్యక్షులు

నవతెలంగాణ-సదాశివనగర్

జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ షెట్కార్‌ను సదాశివనగర్ మండల మాజీ అధ్యక్షులు కాట్మండి సంతోష్ పాటిల్ మర్యాద పూర్వకంగా కలిసినట్లు తెలిపారు. వీరితో పాటు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కైలాష్ శ్రీనివాస్ తదితరులున్నారు.

# పెరిక రాజలింగం సేవలు అభినందనీయం

- పీఆర్టీయూ జిల్లా గౌరవ అధ్యక్షులు ఈ.శంకర్


రాజలింగం దంపతులను సన్మానించి కేక్ తినిపిస్తున్న పలువురు

నవతెలంగాణ-ఎడపల్లి

విశ్రాంత ప్రధానోపాధ్యాయులు, లయన్స్ క్లబ్ ఆఫ్ ఎడపల్లి మాజీ స్థానిక ఉద్యోగుల సంఘం ఎడపల్లి అధ్యక్షులు, తెలంగాణ జేఏసీ ఎడపల్లి మండల కన్వీనర్ పెరిక రాజలింగం సేవలు అభినందనీయమని పిఆర్‌టియు జిల్లా గౌరవాధ్యక్షులు శంకర్ అన్నారు.

గురువారం ఎడపల్లి మండల కేంద్రానికి చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయులు రాజలింగం 70వ జన్మదిన వేడుకలను ఎడపల్లి శ్రీ సాయి సత్సంగ ఆలయంలో స్థానిక ఉద్యోగుల సంఘం, లయన్స్ క్లబ్ ఆఫ్ ఎడపల్లి, తెలంగాణ జేఏసీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. అంతకుముందుగా ఆయన కుటుంబ సభ్యులు రాజలింగంను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎడపల్లి తహసీల్దార్ ధన్వాల్, మాజీ జిల్లా పరిషత్ ఉపాధ్యక్షురాలు రజిత యాదవ్, బోధన్ మాజీ జెడ్పిటిసి ఆరే లావణ్య రమేష్, పీఆర్టీయూ మండలాధ్యక్షులు ఏనుగు కిషోర్ కుమార్, మాజీ సర్పంచ్ ఆకుల మాధవి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్‌ను కలిసిన జుక్కల్ ఎమ్మెల్యే


పిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్‌ను కలిసిన ఎమ్మెల్యేలు

నవతెలంగాణ-మద్నూర్

హైదరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ కమిటీ శాశ్వత ఆహ్వానితులు, ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జునఖర్గే ఆఫీస్ పరిపాలన కమిటీ ఇంచార్జి శ్రీ గుర్దీప్ సింగ్ సప్పల్, పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్‌ను గురువారం జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు మర్యాదపూర్వకంగా కలిశారు. జుక్కల్ ఎమ్మెల్యేతో పాటు ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ ఉన్నారు.

## వీరన్నగుట్ట దుర్గామాత వద్ద మహా యజ్ఞం

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని వీరన్నగుట్ట దుర్గామాత వద్ద గురువారం మహా యజ్ఞాన్ని నిర్వహించారు. గ్రామంలో పాడిపంటలు బాగుండాలని, గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరుతూ మహా యజ్ఞం నిర్వహించారు.

## కేంద్రమంత్రి బండి సంజయ్‌ను కలిసిన బీజేపీ నాయకులు

నవతెలంగాణ-లింగంపేట్

కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు కేంద్రమంత్రి బండి సంజయ్‌ను బీజేపీ రాష్ట్ర నాయకులు డాక్టర్ మర్రిరామిరెడ్డి గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. కేంద్రమంత్రి బండి సంజయ్ నివాసానికి వెళ్లి మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం పార్టీ సభ్యత నమోదు కార్యక్రమం గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్థానిక ఎన్నికల సమీపిస్తున్న నేపథ్యంలో పార్టీ బలోపేతం, సభ్యత నమోదుపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఆయన వెంట జిల్లా నాయకులు మర్రి బాపురెడ్డి, ఎర్ర మల్లేశం తదితరులున్నారు.

# మట్టి రోడ్డు పనులు ప్రారంభం


మట్టి రోడ్డు పనులను ప్రారంభిస్తున్న పలువురు

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని మంబోజిపేట్ గ్రామం నుంచి పంట పొలాలకు వెళ్లేందుకు మట్టి రోడ్డు పనులను కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు బుర్ర నారాగౌడ్ చేతుల మీదుగా గురువారం ప్రారంభించారు. మంబోజిపేట గ్రామానికి చెందిన రైతులు తమ పంట పొలాలకు వెళ్లాలంటే బతుకమ్మ కుంట సామ చెరువు ఉండడంతో పంట పొలాలకు వెళ్లాలంటే రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. రైతుల పండించిన ధాన్యం ఇండ్ల వద్దకు రావాలంటే నానా తంటాలు పడుతున్నారు. ఈ విషయమై రైతులు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు సానుకూలంగా స్పందించి నిధులు మంజూరు చేయడంతో మట్టి రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని కాంగ్రెస్ నాయకులను ఆదేశించారు. ఆయన ఆదేశాల మేరకు మట్టి రోడ్డు పనులు ప్రారంభించారు. దీంతో గ్రామ రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా పంట పొలాలకు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే వారమని మట్టి రోడ్డు నిర్మాణం వల్ల శాశ్వతంగా సమస్య పరిష్కారమైందన్నారు. కార్యక్రమంలో మండల గౌరవ అధ్యక్షులు దశరథ నాయక్, మోహన్, కాంగ్రెస్ మండల నాయకులు, యూత్ అధ్యక్షులు రాజు, సోషల్ మీడియా కోఆర్డినేటర్ నగేష్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## డీఎస్సీలో రాణించిన గ్రామ కార్యదర్శులు


ఉద్యోగం సాధించిన గ్రామ కార్యదర్శులు

నవతెలంగాణ-నసురుల్లాబాద్

సాధనలో ఎన్నో ఒడుదొడుకులు ఎదుర్కొన్నారు. కష్టనష్టాలను దాటారు. కల సాకారమైన వేళ తమ కష్టాన్ని మరిచిపోయారు. మధ్య తరగతి కుటుంబాలకు చెందిన ఇద్దరు గ్రామ కార్యదర్శులు ప్రభుత్వ ఉపాధ్యాయ కొలువులు సాధించారు.

నసురుల్లాబాద్ మండలంలోని ఇద్దరూ గ్రామపంచాయతీ కార్యదర్శులు డీఎస్సీలో ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగాన్ని సాధించారు. అంకోల్ తండా గ్రామపంచాయతీ కార్యదర్శి షేక్ ముఖిద్ ఎస్జిటి, రాములు గుట్ట తండా గ్రామపంచాయతీ కార్యదర్శి రాజా రత్నకుమార్‌కు స్కూల్ అసిస్టెంట్ (బయోలాజీ)గా ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగం సాధించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఉద్యోగం చేస్తూనే ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించడంతో తోటి గ్రామ కార్యదర్శులు, మండల పరిషత్ ఇన్‌ఛార్జ్ ఎంపీడీవో సూర్యకాంత్ వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు వారికి శుభాకాంక్షలు తెలిపి అభినందించారు.

## పిఆర్టియు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా శంకర్ జాదవ్

నవతెలంగాణ-ఎడపల్లి

పిఆర్టియు(టిస్) అసోసియేట్ అధ్యక్షులుగా ఉపాధ్యాయులు శంకర్ జాదవ్‌ను నియమించారు. శంకర్ జాదవ్ నియామకం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ మాజీ సర్పంచ్ శంకర్ నాయుడు, ఎమ్మార్పీఎస్ జిల్లా మాజీ అధ్యక్షులు డల్ల సురేష్ అభినందించారు. గురువారం దుబ్బ తాండా మాజీ సర్పంచ్ దశరథ్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మంచికి మారుపేరుగా మారిన శంకర్ జాదవ్ అందరిని ఆత్మీయంగా పలకరించే వ్యక్తిత్వం గలవాడని తెలిపారు. ఈ స్థానాన్ని పిఆర్‌టియు కట్టబెట్టిందని భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అందుకోవాలని గ్రామ యువకులు, ఉపాధ్యాయుడు శంకర్ జాదవ్‌ను ఆదర్శంగా తీసుకొని ముందడుగు వేయాలన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు భీమ్లా, మాంగ్యా, లక్ష్మణ్, గోపాల్, సంతోష్, రమేష్, ప్రేమ్ దాస్, బాలు శివాజీ, తదితరులు పాల్గొన్నారు.

## గుర్తుతెలియని వ్యక్తి మృతి

నవతెలంగాణ-కామారెడ్డి

మాసాయిపేట్ రైల్వేస్టేషన్ వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతి చెంది ఉన్నట్లు గురువారం ఉదయం కామారెడ్డి స్టేషన్ మేనేజర్ వి.సత్యం సమాచారం ఇచ్చినట్లు నిజామాబాద్ రైల్వే ఎస్సై సాయిరెడ్డి తెలిపారు. సత్యం తెలిపిన వివరాల ప్రకారం.. మాసాయిపేట్ రైల్వే స్టేషన్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి సుమారు 50 నుంచి 55 వయసు గల వ్యక్తి గుర్తు తెలియని రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుని మృతిచెందాడు. ఈ విషయమై పోలీసులు కేసు నమోదు చేసుకుని శవాన్ని కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి మార్చురీకి తరలించారు. ఘటనా స్థలంలో మృతుడిని గుర్తించేందుకు ఎలాంటి ఆధారాలు లభించలేదు. ఈ వ్యక్తిని ఎవరైనా గుర్తు పడితే వెంటనే 8712658591 నెంబర్‌కు ఫోన్ చేయాలని పోలీసులు సూచించారు.

## ఆర్థిక ఇబ్బందులతో చెరువులో దూకి వ్యక్తి ఆత్మహత్య


మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

నవతెలంగాణ-ఎడపల్లి

ఆర్థిక ఇబ్బందులతో తట్టుకోలేక ఓ వ్యక్తి మనస్థాపానికి గురై చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండలం లోని అశోక్ సాగర్ చోటుచేసుకుంది. ఎస్ఐ వంశీకృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ పట్టణంలోని కసాబ్‌గల్లికి చెందిన నర్సింగ్ కళ్యాణ్ కార్ (55) అనే వ్యక్తి ఈ నెల 8నుంచి కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు 2వ టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆచూకీ కోసం బంధువుల, స్నేహితుల ఇండ్లల్లో వెతికినా లభించలేదు. కాగా శుక్రవారం ఎడపల్లి మండలంలోని అశోక్‌సాగర్ చెరువులో వ్యక్తి శవం ఉందనే సమాచారం మేరకు ఎస్ఐ కృష్ణారెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కుమారుడు కళ్యాణ్ కార్గ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## చైర్మన్, వైస్ చైర్మన్‌ను సన్మానించిన ఘన్‌పూర్ నాయకులు


చైర్మన్, వైస్ చైర్మన్‌లను సన్మానిస్తున్న నాయకులు

నవతెలంగాణ-వర్ని

ఉమ్మడి వర్ని, మోస్రా, రుద్రూర్, చందూర్ మండలాల మార్కెట్ కమిటీ చైర్మన్ సురేష్ బాబా, కొత్మీకర్ లక్ష్మణ్‌ను ఘన్‌పూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సాయిలు శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు గుని బాలరాజు, రమేష్, ఇందూర్ సాయిలు తదితరులున్నారు.

## ఉపాధ్యాయుల నియామకపత్రాల అందజేతలో ఎమ్మెల్యే

నవతెలంగాణ-మద్నూర్

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఉద్యోగాల పరిధిలో రాష్ట్ర ప్రజల్లో పేరు ప్రతిష్టలు పొందుతూ వస్తోంది. ఉద్యోగాల నియామకాల్లో భాగంగా ఉపాధ్యాయుల భర్తీ చేపట్టింది. ఈ ఉద్యోగాల నియామకాల్లో నియమితులైన వారికి హైదరాబాదులోని ఎల్‌బి స్టేడియంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాష్ట్ర మంత్రులు చేతుల మీదుగా నియామకపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో జుక్కల్ ఎమ్మెల్యే తోటా లక్ష్మి కాంతారావు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
4
నిజామాబాద్
శుక్రవారం | అక్టోబర్ 11, 2024 | www.navatelangana.com


## నీటి సమస్య తీరింది



బోరువేస్తున్న దృశ్యం

**నవతెలంగాణ-భీంగల్ రూరల్**

మండల కేంద్రంలోని గోనుగొప్పుల గ్రామంలో ఎస్సీ కాలనీ వాసులు చాలా రోజుల నుంచి నీటి సమస్యతో అష్ట కష్టాలు పడుతున్నారు. బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్‌కు తెలియజేయగా వెంటనే స్పందించి బోర్ బండి పంపించారని కాలనీ వాసులు తెలిపారు. బోరువేయించడంతో ముత్యాల సునీల్ కుమార్‌కు కాలనీ వాసులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బోజా గౌడ్, గ్రామ శాఖ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చరణ్‌గౌడ్, గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు వంజరీ శంకర్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా సెషన్స్ కోర్టు పిపిగా రాజేశ్వర్‌రెడ్డి



పీపీని సన్మానిస్తున్న న్యాయవాదులు

**నవతెలంగాణ-కంఠేశ్వర్**

నిజామాబాద్ సెషన్స్ కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నిజామాబాద్ బార్ అసోసియేషన్ సీనియర్ న్యాయవాది ధర్పల్లి రాజేశ్వర్‌రెడ్డిని నియమిస్తు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రవిగుప్తా ఉత్తర్వులు జారీచేశారు. రాజేశ్వర్‌రెడ్డికి గురువారం జిల్లా కోర్టు ప్రాంగణంలోని పబ్లిక్ ప్రాసిక్యూటర్ కార్యాలయంలో ఇంచార్జీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మాదస్తు రాజారెడ్డి పదవి భాద్యతలను అప్పగించారు. ఈ సందర్భంగా బార్ అధ్యక్షుడు మల్లెపూల జగన్ మోహన్ గౌడ్, సీనియర్ న్యాయవాదులు ఆకుల రమేష్, నీలకంఠ రావు, ఎర్రం గణపతి, గడుగు గంగాధర్, రాజ్ కుమార్ సుభేదార్, శ్రీహరి ఆచార్య, మంచికట్ల గోవర్ధన్, కిరణ్ కుమార్‌గౌడ్, నల్లవెల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఆశా నారాయణ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

## చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

**నవతెలంగాణ-మాక్లూర్**

వాహనం ఢీకొని గాయపడ్డ వ్యక్తి చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడు. ఎస్ఐ రాజశేఖర్ వివరాల ప్రకారం.. నందిపేట మండల కేంద్రానికి చెందిన ఎనుగందుల నారాయణ (54) ఆర్టీసీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. బుధవారం రాత్రి నందిపేట్ నుంచి రాత్రి సుమారు 9 గంటలకు నిజామాబాద్ వెళ్తున్నాడు. దాస్ నగర్ భారత్ పెట్రోల్ బంక్ సమీపంలో ఎదురుగా వస్తున్న ఐచర్ వాహనం ఆయన్ను ఢీకొంది. ఈప్రమాదంలో తలకి తీవ్ర గాయాలు కావడంతో హైదరాబాద్ తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మరణించినాడన్నారు. మృతుని కొడుకు ప్రశాంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతి

**నవతెలంగాణ-కంఠేశ్వర్**

గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన నగరంలోని రైల్వే స్టేషన్ సమీపంలో చోటుచేసుకుంది. స్థానికుల సమాచారం ప్రకారం.. గుర్తు తెలియని వ్యక్తి సుమారు (55) వ్యక్తి అనారోగ్యంతో స్టేషన్ బయట మద్యం మత్తులో మురికి కాలువలో పడి మృతి చెంది ఉన్నట్టు తెలుస్తుంది. స్థానికులు గమనించి వెళ్లి చూడగా అప్పటికే మృతి చెందాడు. స్థానిక ప్రజలు, పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరిస్తున్నారు.

## ట్యాక్స్ బకాయిలపై ఉద్యమించాలి

- బహుజన లెఫ్ట్ పార్టీ

**నవతెలంగాణ-కంఠేశ్వర్**

మున్సిపల్ కార్పొరేషన్‌కు రావాల్సిన ట్యాక్స్ బకాయిలపై ప్రజలు ఉద్యమించాలని బహుజన లెఫ్ట్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దండి వెంకట్ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌కు రావాల్సిన కోట్లాది రూపాయల ట్యాక్స్ మొండి బకాయిలను సకాలంలో వసూలు చేయాలని తెలిపారు. నగర మౌలిక సదుపాయాల కల్పన కోసం ఖర్చు చేస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో అదనంగా నగరాభివృద్ధి ఉపయోగపడుతుందని సూచించారు. నగరంలో పేద మధ్యతరగతి ప్రజలు ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా మున్సిపల్ కార్పొరేషన్‌కు ట్యాక్స్‌లు చెల్లిస్తునట్టు పేర్కొన్నారు. కోట్లాది రూపాయల లాభాలను పొందుతున్న కొందరు వ్యాపారులు, కోట్లలో బకాయిలు పెట్టినట్లు తమ పార్టీ దృష్టికి వచ్చిందని సూచించారు. ఈ విషయంలో నిజానిజాలు తెలుసుకోవడానికి సమాచారం చట్టం ద్వారా ఆ సంస్థలు 2023-2024 ఆర్థిక సంవత్సరంలో చెల్లించిన ట్యాక్స్ వివరాలను ఇవ్వాలని ఈనెల 7న మున్సిపల్ కార్పొరేషన్‌కు దరఖాస్తు చేశామని తెలిపారు. వివరాలు వచ్చాకా ప్రజల భాగస్వామ్యంతో మున్సిపల్ కార్పొరేషన్‌కు రావాల్సిన ట్యాక్స్ బకాయిల వసూలు కోసం ఆందోళన నిర్వహిస్తామని పేర్కొన్నారు. అదేవిధంగా యువకులు, విద్యావంతుల మున్సిపల్ కార్పొరేషన్‌కు రావాల్సిన కోట్లాది రూపాయల బకాయిలను వసూలు పై దృష్టి సారించాలని విజ్ఞప్తి తెలిపారు.

## సీఎం చిత్రపటానికి పాలాభిషేకం




సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

**నవతెలంగాణ-ఏర్గట్ల**

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా 11,062 మంది ఉపాధ్యాయ కొలువులు సాధించిన వారికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నియామక పత్రాలు అందించారు. దీంతో గురువారం మండలకేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు శివన్నోళ్ల శివ కుమార్ మాట్లాడుతూ.... కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో ప్రకారం నిరుద్యోగులకు రేవంత్ రెడ్డి 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని ప్రకటించారని తెలిపారు. హామీ ప్రకారం గెలిచిన 9 నెలల కాలంలో 70 వేల ఉద్యోగాలు భర్తీ చేశారని అన్నారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు సోమ దేవరెడ్డి, నాయకులు ఆడేం గంగాప్రసాద్, గడ్డం జీవన్, ముస్కు మోహన్ రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రావణ దహనం పనుల పరిశీలన




ఏర్పాట్లను పరిశీలిస్తున్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి

**నవతెలంగాణ-బాన్సువాడ(నసురుల్లాబాద్)**

బాన్సువాడ పట్టణంలో ఆనవాయితీగా వస్తున్న రావణ దాహన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర వ్యవసాయ సలహాదారులు పోచారం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. గురువారం బాన్సువాడ పట్టణంలోని ప్రొఫెసర్ జయశంకర్ మినీ స్టేడియంలో ఈ నెల 12న దసరా సందర్భంగా రావణదహన కార్యక్రమం చేయనున్నారు. ఈ సందర్భంగా రావణ దాహనం కోసం చేపట్టిన పనులను ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. పనులు వేగవంతం చేయాలని, పండుగ సందర్భంగా వచ్చే పట్టణ ప్రజల కోసం ఎలాంటి సౌకర్యం లేకుండా తగుజాగ్రత్తలు తీసుకోవాలని మున్సిపల్ చైర్మన్ గంగాధర్‌కు సూచించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటన జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రశాంత వాతావరణంలో దసర పండుగ జరుపుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పట్టణ మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, పట్టణ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## దుర్గాదేవి ఉత్సవాల్లో ఐడిసిఎంఎస్ మాజీ చైర్మన్

**నవతెలంగాణ-జక్రాన్‌పల్లి**

మదిరాజ్ పెద్ద సంఘం ఆధ్వర్యంలో దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కుంకుమార్చన పూజలో మాజీ ఐడీసీఎంఎస్ చైర్మన్ మునిపల్లి పెద్ద సాయిరెడ్డి గురువారం పాల్గొన్నారు. అనంతరం మదిరాజ్ పెద్ద సంఘ సభ్యులు, రాజకీయ నాయకులు సాయిరెడ్డిని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు సొప్పరి వినోద్, మాజీ ఉప సర్పంచ్ జక్కుల బాలకిషన్, మాజీ వైస్ ఎంపీపీ జితేందర్ నాయక్, పాల్గొన్నారు.

## రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ

**నవతెలంగాణ-కంఠేశ్వర్**

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని రెండవ పోలీస్ స్టేషన్ పరిధిలో నిజామాబాద్ నగర సిఐ శ్రీనివాస్ రాజ్ గురువారం రౌడీషీటర్లకు పోలీస్ స్టేషన్లో కౌన్సెలింగ్ నిర్వహించారు. రాబోయే పండుగలను దృష్టిలో పెట్టుకొని ఏదైనా నేరంలో ఉన్నవారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని సత్ప్రవర్తన కలిగి ఉండాలని అన్నారు. లేకుంటే కేసులు నమోదు చేసి కోర్టు ముందు హాజరు పరుస్తామని తెలిపారు. ఒకవేళ పద్ధతి మార్చుకోకపోయిన సరైన నడవడిక లేనిపక్షంలో ఎక్కువ కేసులు ఉన్న వారిపై పీడీ యాక్ట్ కూడా పెట్టి జైలుకు పంపిస్తామన్నారు. ఎవరైనా సత్ప్రవర్తన కలిగి ఉంటే అలాంటి వారి షీట్‌ని కూడా క్లోజ్ చేయడానికి ప్రయత్నిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో రెండవ పోలీస్ స్టేషన్ ఎస్ఐ యాసిర్ అరాఫత్, రెండవ పోలీస్ స్టేషన్ పోలీసులు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

### హిట్ అండ్ రన్ కేసుల్లో

# పరిహారంకోసం సత్వర విచారణ

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు
- మానిటరింగ్ కమిటీ సమావేశం



మాట్లాడుతున్న కలెక్టర్, పాల్గొన్న అధికారులు

**నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ**

గుర్తు తెలియని వాహనాలు ఢీకొని మృతి చెందిన, తీవ్రంగా గాయపడిన (హిట్ అండ్ రన్) కేసులలో బాధితులకు, వారి కుటుంబీకులకు చట్ట ప్రకారం నష్ట పరిహారం మంజూరు చేసేందుకు వీలుగా త్వరితగతిన విచారణ జరపాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఆయా డివిజన్ల ఆర్డీఓలను ఆదేశించారు. కలెక్టర్ అధ్యక్షతన ఆయన ఛాంబర్లో గురువారం హిట్ అండ్ రన్ కేసుల జిల్లా స్థాయి పర్యవేక్షణ కమిటీ సమావేశం జరిగింది. జిల్లాలో 32 హిట్ అండ్ రన్ కేసులు నమోదవగా, వాటిలో 27 ప్రమాద ఘటనలకు సంబంధించి బాధిత కుటుంబాలు గుర్తించబడినాయని అధికారులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. వీటిలో నిజామాబాద్ డివిజన్ పరిధిలో 17, ఆర్మూర్ డివిజన్లో 7, బోధన్ డివిజన్లో 3 కేసులు ఉన్నాయని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మాట్లాడుతూ, హిట్ అండ్ రన్ కేసులలో మృతి చెందినట్లైతే చట్ట ప్రకారం సాధారణ బీమా కౌన్సిల్ ద్వారా బాధిత కుటుంబీకులకు రూ. 2 లక్షలు, తీవ్రంగా గాయపడితే బాధితులకు రూ. 50 వేలు నష్ట పరిహారం అందించాల్సి ఉందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని బాధితులకు పరిహారం మంజూరు చేసేందుకు వీలుగా త్వరితగతిన సమగ్ర విచారణ జరిపి నివేదికలు సమర్పించాలని ఆర్డీఓలకు సూచించారు. విచారణ నివేదిక రూపకల్పనకు అవసరమైన వివరాలను ఆర్డీఓలకు అందించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జాప్యానికి తావులేకుండా బాధిత కుటుంబాలకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని, అదే సమయంలో అన్ని వివరాలను సమగ్రంగా పరిశీలన చేయాలని సూచించారు. ఈ సమావేశంలో బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, అదనపు డీసీపీ బస్వారెడ్డి, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్, జిల్లా రవాణా శాఖ అధికారి ఉమామహేశ్వర్ రావు, ట్రాఫిక్ ఏసీపీ నారాయణ, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారిణి డాక్టర్ రాజశ్రీ, కలెక్టరేట్ కార్యాలయ పర్యవేక్షకులు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# తులం బంగారం ఎక్కడ?

- రసాభాసగా మారిన చెక్కుల పంపిణీ కార్యక్రమం

**నవతెలంగాణ-ముప్కాల్**



ముప్కాల్:కాంగ్రెస్, బీఆర్ఆర్ నాయకుల వాద్వివాదం

ముప్కాల్ రైతు వేదిక సభ స్థలిలో గురువారం మాజీ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి చేతులమీదుగా కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను లబ్దిదారులకు అందజేశారు. మొత్తం 57 చెక్కులను పంపిణీ చేసినట్టు తహశీల్దార్ సీహెచ్.కృష్ణ తెలిపారు. ముప్కాల్ 22, కొత్తపల్లి 10, వేంపల్లి 7, రెంజర్ల 6, నాగంపేట్ 4, వెంచిర్యాల 4, నల్లూర్ 4 ఇలా మండలం మొత్తంగా కళ్యాణాలక్ష్మి (52), షాదిముబారక్ (5) చెక్కులు పంపిణీ చేశామన్నారు. చెక్కుల పంపిణీకి ముందు ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి దాదాపు సంవత్సర కాలం దగ్గర పడుతున్న ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదని విమర్శించారు. ఆడబిడ్డకు పెళ్లి అనంతరం లక్ష రూపాయలతో పాటు తులం బంగారం ఎక్కడ అని ప్రభుత్వాన్ని సీఎం రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి రాష్ట్ర ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీకాంత్, వ్యవసాయాధికారి సాయికృష్ణ, రెవిన్యూ సిబ్బంది, సొసైటీ చైర్మన్లు, వేల్పూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు..

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి సంవత్సరం కావస్తున్నా ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదని విమర్శించడంతో పాటు తులం బంగారం విషయం ఎమ్మెల్యే లేవనెత్తిన సందర్భంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆందోళనకు దిగారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల నాయకుల మధ్య కొద్దిసేపు చెక్కుల పంపిణీ కార్యక్రమం రసాభాసగా మారింది. సీఐ శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు ఇరువర్గాల పార్టీల నాయకులకు నచ్చచెప్పడంతో సమస్య సద్దుమణగడంతో చెక్కుల పంపిణీ కార్యక్రమం కొనసాగింది..

**పోటాపోటీ నినాదాల మధ్య చెక్కుల పంపిణీ**

**నవతెలంగాణ-ఏర్గట్ల**



ఏర్గట్ల : చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే

మండల కేంద్రంలోని రైతు వేదికలో కళ్యాణ లక్ష్మీషాధి ముబారక్ చెక్కులను పంపిణీ చేయడానికి ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి బుధవారం మండల కేంద్రానికి వచ్చారు. ఆయన రావడంతోనే అక్కడ ఉన్న కాంగ్రెస్ పార్టీకి చెందిన కార్యకర్తలు, బీఆర్ఎస్ పార్టీకి చెందిన కార్యకర్తలు పోటాపోటీ నినాదాలు చేసుకున్నారు. ఒక్కసారిగా ఆ ప్రాంతమంతా రాజకీయ వేడి రాజుకుంది. చెక్కుల పంపిణీలో భాగంగా ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ... మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పేదింటి ఆడబిడ్డల కోసం కల్యాణ లక్ష్మీషాధి ముబారక్ పథకాన్ని ప్రారంభించారని అన్నారు. రేవంత్ రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం లక్ష రూపాయలతో పాటు తులం బంగారం అందించాలని కోరారు. కార్యక్రమంలో కమ్మర్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ పాలెపు నర్సయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కొరిపెల్లి లింగారెడ్డి, ఏర్గట్ల, తాళ్ల రాంపూర్ పీఏసీఎస్ చైర్మెన్లు బర్మ చిన్న నర్సయ్య, పెద్దకాపుల శ్రీనివాస్ రెడ్డి, వైస్ చైర్మన్ సిగసారం గంగారాం, ఎమ్మార్వో శ్రీలత, ఆర్ఐ సదానందం పాల్గొన్నారు.

## ప్రభుత్వాల నిర్లక్ష్యం ఖరీదు రెండున్నర లక్షల ఆత్మహత్యలు

- తెలంగాణ మేధావుల సంఘం చైర్మన్ డాక్టర్ బి వి కేశవులు

**నవతెలంగాణ-కంఠేశ్వర్**

భారతదేశంలో మానసిక ఆరోగ్యం పట్ల ప్రభుత్వాలు తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నాయని, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలు ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు మానసిక వైద్య సేవలు అందుబాటులో లేకపోవడం వల్ల రోగులు తీవ్రమైన కష్టాలను ఎదుర్కొంటున్నారని. బడ్జెట్‌లో కనీసం ఒక శాతమైన కేటాయించకపోవడం బాధాకరమని తెలంగాణ మేధావుల సంఘం చైర్మన్, సీనియర్ మానసిక వైద్య నిపుణులు డాక్టర్ కేశవులు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం ప్రపంచ మానసిక ఆరోగ్య వారోత్సవాల సందర్భంగా నిజామాబాద్‌లోని ఖలీల్‌వాడిలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి డాక్టర్ కేశవులు హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ కేశవులు మాట్లాడుతూ.. భారతదేశం తీవ్రమైన మానసిక ఆరోగ్య సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది, ప్రపంచవ్యాప్తంగా మేజర్ డిప్రెసివ్ డిజార్డర్స్ అత్యధికంగా ఉన్న దేశాల్లో భారత్ దేశం ఒకటిగా ఉందని తెలిపారు. దాదాపు 150 మిలియన్ల మందికి చురుకైన మానసిక ఆరోగ్య సేవలు అవసరం కాగా, దురదృష్టవశాత్తు మన దేశాన్ని ప్రపంచ ఆత్మహత్యల రాజధానిగా కూడా పిలుస్తారని అన్నారు. ఏటా 2లక్షల60వేల కేసులు నమోదవు తున్నాయని తెలిపారు. 50శాతం మానసిక ఆరోగ్య పరిస్థితులు 14 సంవత్సరాల వయస్సులో ప్రారంభమవుతాయని, 75శాతం మానసిక ఆరోగ్య పరిస్థితులు 24 సంవత్సరాల వయస్సులో అభివృద్ధి చెందుతాయని అన్నారు. ఈ సంక్షోభం కేవలం వ్యక్తులను మాత్రమే ప్రభావితం చేయడమే కాకుండా భారత ఆర్థిక వ్యవస్థకు బిలియన్ల డాలర్ల నష్టం కలిగిస్తోందని తెలిపారు. నేషనల్ మెంటల్ హెల్త్ సర్వే 2020 ప్రకారం భారతదేశంలో సుమారు 14శాతం మంది ప్రజలు ఏదో ఒక రకమైన మానసిక ఆరోగ్య సమస్యతో బాధపడుతున్నారని, సుమారు 45 మిలియన్ల మంది భారతీయులు డిప్రెషన్, 38 మిలియన్ల మంది ఆందోళన వ్యాధులతో, సుమారు 1శాతం జనాభా స్కిజోఫ్రేనియాతో బాధపడుతున్నారని డాక్టర్ కేశవులు వివరించారు. భారతదేశంలో ప్రతి లక్ష మందికి కేవలం 0.75 మంది మానసిక వైద్యులు మాత్రమే ఉన్నారన్నారు. ఇది ప్రపంచ ఆరోగ్య సంస్థ సిఫార్సు చేసిన లక్ష్యానికి చాలా తక్కువని, 2024-25 భారత బడ్జెట్‌లో మానసిక ఆరోగ్యానికి తక్కువ ప్రాధాన్యత దక్కిందని తెలిపారు. మొత్తం ఆరోగ్య శాఖకు కేటాయించిన 90వేల 658.63 కోట్లు కేటాయించగా అందులోంచి కేవలం ఒకశాతం మాత్రమే మానసిక ఆరోగ్యానికి కేటాయించారన్నారు. ఇది దేశంలో ఉన్న మానసిక ఆరోగ్య సమస్యలను పరిష్కరించడానికి ఏ మాత్రం సరిపోదని డాక్టర్ కేశవులు ప్రభుత్వాలను నిలదీశారు. సమావేశంలో రమేష్ నాయక్, పాండు , సురేష్, విజయ, త్రిష, శిరీష, కావ్య జ్యోతి, శారద, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీల్లో బంగారు పతకాలు

**నవతెలంగాణ-ఆర్మూర్**



పతకాలు గెలుచుకున్న క్రీడాకారులను అభినందిస్తున్న పలువులు

ఈనెల 6 నుండి 10 వరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నంద్యాలలో జరిగిన 42వ జూనియర్ సాఫ్ట్ బాల్ ఛాంపియన్షిప్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు బంగారు పతకాలు సాధించారు. గ్రాండ్ ఫైనల్ మ్యాచ్‌లో పంజాబ్ రాష్ట్ర జట్టుపై 02-01పరుగుల తేడాతో విజయం సాధించి బంగారు పతకాలు అందుకున్నట్లు జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు వి ప్రభాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మర్కంటి గంగా మోహన్ గురువారం తెలిపారు. సుంకపాక సౌమ్యరాణి (పంది మడుగు), గోక సాత్విక (పిప్పిరి), దేశెట్టి సన్నిత (పుప్పాలపల్లి), కేతావత్ సోనీ (మంచిప్ప), జిన్న వైశాలి (అక్లూర్) మరియు గోక శ్రావిక (పిప్పిరి) పాల్గొని తెలంగాణ రాష్ట్ర జట్టును ప్రథమ స్థానంలో నిలపడానికి కీలకపాత్ర పోషించారని అన్నారు. ఈ ఛాంపియన్షిప్‌లో గోక సాత్విక చక్కని ప్రతిభ కనబరిచి జాతీయ ఉత్తమ పిక్చర్ అవార్డును సాఫ్ట్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాయింట్ సెక్రెటరీ కే.శోభన్ బాబు చేతుల మీదుగా అందుకుంది. ఈ సందర్భంగా బంగారు పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులను జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ చైర్మన్ బద్దం లింగారెడ్డి, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం ప్రధాన కార్యదర్శి బొజ్జ మల్లేష్ గౌడ్, జిల్లా కబడ్డీ సంఘం అధ్యక్షులు ఏ. లింగయ్య, ప్రధాన కార్యదర్శి గంగాధర్, జిల్లా బేస్ బాల్ సంఘం అధ్యక్షులు ఎల్.మధుసూదన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సొప్పరి వినోద్, జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు జైపాల్ రెడ్డి, సంయుక్త కార్యదర్శులు మర్కంటి సుజాత, చిప్ప నవీన్, సీనియర్ ఫిజికల్ డైరెక్టర్లు, జిల్లా సాఫ్ట్ బాల్ సంఘం సభ్యులు, జిల్లా కోచ్‌లు నరేష్, వి మౌనిక అభినందించారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

**నవతెలంగాణ-డిచ్‌పల్లి**

ఇందల్‌వాయి మండలంలోని నల్లవెల్లి గ్రామానికి చెందిన గూండ్ల బాలరాజు కొన్ని రోజుల క్రితం మృతి చెందారు. అయన కుటుంబ పరిస్థితి దయనీయ స్థితిలో ఉన్నదని గ్రహించిన గ్రామస్తులు, యువజన సంఘాలు తమవంతుగా జమ చేసిన రూ.25,100 కుటుంబ సభ్యులకు గురువారం అందించారు. ఎలాంటి సహాయ సహకారాలు కావాలన్నా అందజేస్తామని కుటుంబానికి భరోసా కల్పించారు. కార్యక్రమంలో నిజామాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాజన్న, గంగాధర్ గ్రామస్తులు, యువకులు, సంఘాల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు

# ఉద్యోగుల సమస్యలపై అధికారులకు ఫిర్యాదు చేస్తాం

- జిల్లా ఆదివాసీ నాయకపోడ్ సేవా సంఘం

**నవతెలంగాణ-ఆర్మూర్**

పట్టణంలో పెర్కిట్ భీమన్న మందిరం వద్ద జిల్లా ఆదివాసీ నాయకపోడ్ ఉద్యోగుల సమావేశం గురువారం పుట్ట రాజేశ్వర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ఆదివాసి నాయకపోడ్ సేవా సంఘం అధ్యక్షులు గాండ్ల రాంచందర్ హాజరై మాట్లాడారు. జిల్లాలో ఉద్యోగ సంఘంను బలోపేతం చేయాలని, 2024లో ఉద్యోగాలు సాధించిన వారికి సన్మాన కార్యక్రమం నిర్వహించాలని తెలిపారు. జిల్లాలో ఉన్న ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి చర్చించి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలని, ఎస్టీ వర్గీకరణ అంశంపైన రాష్ట్ర కార్యవర్గ సభ్యులతో చర్చించాలని అన్నారు. కార్తీక మాసంలో జిల్లా బాడీ తరపున నిర్వహించే భీమన్న కళ్యాణ ఉత్సవాల్లో ఉద్యోగుల పెద్ద సంఖ్యలో హాజరుకావాలని, రాబోయే రోజుల్లో జిల్లాలో ఉన్న ఆదివాసి నాయకపోడ్ విద్యార్థులు పోటీ పరీక్షల్లో పాల్గొనే విద్యార్థులకు సహాయ సహకారాలు అందించాలని ఆయన సూచించారు. విదేశాల్లో ఉన్నత చదువులకోసం వెళ్లే ఆదివాసి నాయకపోడు విద్యార్థులకు అంబేద్కర్ ఓవర్సీస్ స్కాలర్ షిప్ పథకాన్ని అందే విధంగా చూడాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ఆదివాసి నాయకపోడ్ సేవాసంఘం కార్యనిర్వాహక అధ్యక్షులు లోలం గంగాధర్, కోశాధికారి శానం పవన్ కుమార్, ఉపాధ్యక్షులు మూఢ అశోక్, ఉద్యోగుల సేవా సంఘం ప్రధానకార్యదర్శి కోసెడుగు రవి, వర్కింగ్ ప్రెసిడెంట్ కొండ్రు నవీన్, కోశాధికారి ఐలాపూర్ రాజు, కార్యవర్గ సభ్యులు జానుముల సంజీవ్, సాయి కుమార్, పుట్ట గంగాధర్, ప్రవీణ్ కుమార్, సుదర్శన్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## దళితవాడలో పరిశ్రమ పెట్టొద్దు : ఎంఆర్‌పీఎస్

**నవతెలంగాణ-జక్రాన్ పల్లి**

మండలంలోని కలిగోట్ గ్రామంలో దళితవాడలో పసుపు ఆకుల కుంచి ఆయిల్ శుద్ధి చేసే పరిశ్రమ వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటారని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కనక ప్రమోద్ అన్నారు. గురువారం మండలంలోని కలిగోట్ గ్రామానికి వచ్చి వారి సమస్య తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కలిగోట్ గ్రామంలో పసుపు ఆకుల నుంచి ఆయిల్ శుద్ధికి సంబంధించిన ఒక పరిశ్రమను మాదిగ మాల కాలనీ పక్కన పెట్టడం వల్ల అక్కడి ఇబ్బందులు కలుగుతాయని అన్నారు. అనంతరం ఎస్సై, తహసీల్దార్‌ను కలిసి సమస్యను వివరించారు. సమస్య పరిష్కారం దిశగా ఆలోచన చేయాలని విన్నవించారని తెలిపారు. వెంటనే పక్కన పెట్టే ప్రయత్నాలు అధికారులు చేసే ఎంతటి పోరాటానికైనా సిద్దంగా ఉండాలని కుల సంఘ సభ్యులకు తెలిపారు.

## స్వచ్ఛత అంటే ఇదేనా ..?

**నవతెలంగాణ-భీంగల్ రూరల్**




ప్రతి పల్లె స్వచ్ఛతకు చిరునామాగా మార్చడమే లక్ష్య మంటూ ప్రజాప్రతినిధులు, అధికారులు చెబుతున్న వాస్తవ పరిస్థితులు దానికి భిన్నంగా కనిపిస్తున్నాయి. భీంగల్ నుంచి ఆర్మూర్ వెళ్లే రహదారి పక్కనే చెత్త పేరుకుపోయి దోమలకు కేంద్రాలుగా మారుతున్నాయి. మత్స్యకార గ్రామాలైన భీంగల్ మండలంలోని కెసిఆర్ డబుల్ బెడ్ రూమ్ కాలనీలో ఈ సమస్య తీవ్రంగా ఉంది. ప్రస్తుతం పండగలు, వివాహాలు జరిగే సమయం కావడంతో విందు భోజనాల్లో మిగిలిన వ్యర్థాలు రోడ్డుపైనే పారేస్తున్నారు. ఇవి తిన్న పశువులు రోగాల బారిన పడుతున్నాయి. బస్టాండ్‌లో చెత్త విపరీతంగా వేయడంతో దోమలు చేరి పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయని వాపోతున్నారు. భీంగల్ నుంచి ఆర్మూర్ వెళ్లే రహదారిలో చెత్త సమస్య ఎక్కువ అవడంతో దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నామంటూ ప్రయాణికులు అక్కడి స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
శుక్రవారం | అక్టోబర్ 11, 2024 | www.navatelangana.com



బతుకమ్మతో చిన్నారులు





కంఠేశ్వర్ : బతుకమ్మ ఆడుతున్న మేయర్ నీతు కిరణ్, మహిళలు



గాజుల్‌పేట్ జై శ్రీరాం యూత్ అసోసియేషన్‌లో...



పొతంగల్: బతుకమ్మ ఆడుతున్న మహిళలు

# సద్దుల సంబురం

నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలో గురువారం సద్దుల బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు చిన్న పెద్ద తేడాలేకుండా తీరొక్కపూలతో బతుకమ్మను పేర్చి.. ఒక చోట చేర్చి.. పాటలు పాడుతూ బతుకమ్మ ఆడారు. అనంతరం స్థానిక చెరువుల్లో బతుకమ్మలను నిమజ్జనం చేశారు.

– నవతెలంగాణ, విలేకరుల బృందం



పెద్దకొడప్‌గల్‌లో...



పిట్లం: బతుకమ్మ ఎత్తుకున్న ఎమ్మెల్యే దంపతులు...



రోటరీనగర్‌లో బతుకమ్మతో చిన్నారి...



లింగంపేట : బతుకమ్మ ఆడుతున్న మహిళలు



రామారెడ్డిలో..



కమ్మర్‌పల్లి: బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సతీమణి నీరజారెడ్డి



పిట్లంలో...



కంఠేశ్వర్: వినాయక్‌నగర్‌లోని న్యూ హౌజింగ్ బోర్డు కాలనీలో..



డిచ్‌పల్లి: సంస్థాన్ సిర్నపల్లిలో...



రోటరీనగర్‌లో...



నాగిరెడ్డిపేట్‌లో...



జక్రాన్‌పల్లిలో...



మాక్లూర్‌లో...



దోమకొండలో...



కమ్మర్‌పల్లిలో...



నిజాంసాగర్‌లో..



నాగిరెడ్డిపేట్‌లో...



పొతంగల్‌లో బతుకమ్మను పేర్చుతున్న మహిళలు



రెంజల్ : వీరన్నగుట్టలో బతుకమ్మతో మహిళ



డిచ్‌పల్లి: బతుకమ్మను నిమజ్జనం చేయడానికి వెళ్తున్న మహిళలు



గాంధారిలో...



మద్నూర్‌లో...



లింగంపేట్ : బతుకమ్మను ఎత్తుకున్న మాజీ జెడ్పీటీసీ